Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు


rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 270 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 10 - 6 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలపై సీఎం ఫోకస్.. డేటా డ్రివెన్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యం




**అమరావతి, (రాజధాని వార్తలు):** జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్న సూచికలను మెరుగుపరచడం, అగ్రశ్రేణి రాష్ట్రాలతో సమానంగా లక్ష్యాలను చేరుకోవటమే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. నిర్దేశించుకున్న లక్ష్యాలతో పాటు రియల్ గ్రోత్ ఆధారంగా పనితీరును అంచనా వేసేలా స్కోరింగ్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలు, కీ-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లపై సచివాలయంలో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో సమీక్షకు ఆర్థిక, ప్రణాళిక, వ్యవసాయ, ఉద్యాన, రవాణా, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజర య్యారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి వివిధ ప్రభుత్వ శాఖలకు కీ పెర్ఫార్మెన్స్ ఇండికేట ర్లను నిర్దేశించారు. రాష్ట్ర- క్షేత్రస్థాయి ఆర్థిక స్థితిగతులను విశ్లేషించేందుకు ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేది కలను సిద్ధం చేయాలని నిర్ణయించామని సీఎం చంద్రబాబు తెలి పారు. మౌలిక సదుపాయాలపై చేసే వ్యయం 3.5 రేట్ల మేర ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించేలా ఉండాలని దిశానిర్దేశం చేశారు. రియల్ టైమ్‌లో ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఏఐ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నామని పేర్కొన్నారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా డేటా డ్రివెన్ గవర్నెన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు.. సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రతీ రంగంలోనూ గ్రాస్ వాల్యూ అడిషన్ పెంపుదల చేసేందుకు శ్రద్ధ పెట్టాలని మార్గనిర్దేశం చేశారు. తయారీ, గనులు, వాణిజ్యం, రవాణా తదితర రంగాలతో పాటు అమరావతి, పోలవరం, పోర్టులు, ఎయిర్ పోర్టులతో ఆర్థిక వ్యవస్థకు మల్టీప్లైయర్ ఎఫెక్ట్ వచ్చేలా చర్యలకు సూచించారు. కేపీఐలు మెరుగ్గా ఉంటే... వృద్ధి రేటు పెరుగుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదం.. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 25 లక్షల పరిహారం అందజేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. గాయపడిన వారికి రూ. 10 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని తెలిపారు. మంగళవారం విశాఖపట్నంలో మంత్రి లోకేశ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్టీల్ ప్లాంట్‌లో నిన్న జరిగిన ఘటన చాలా బాధాకరమని అన్నారు. 4.15 నిమిషాలకు ఈ ప్రమాదం జరిగిందని తెలియగానే కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు ఇక్కడికి వచ్చారని తెలిపారు. ఈ ఘటనలో 9 మంది చనిపోయారని... 6 మంది గాయపడ్డారని చెప్పారు. తాము పరిహారం ఇవ్వడానికి ఇక్కడకు రాలేదని... శాశ్వతంగా బాధితులకు అండగా ఉంటామని లోకేశ్ భరోసా కల్పించారు. బాధిత కుటుంబాలతో సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్మికులకు పూర్తిగా అండగా ఉంటామని భరోసా కల్పించారు.

**చిత్తశుద్ధితో స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకున్నాం..**

తమకు ఉన్న చిత్తశుద్ధితో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకున్నామని లోకేశ్ స్పష్టం చేశారు. తమకు వాట్సాప్ గ్రూప్ ఒకటి ఉందని.. రాష్ట్రంలో ఎక్కడ ఏ ఘటన జరిగినా తాము తక్షణమే అక్కడకు వెళ్తామని.. అందులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఉన్నారని ప్రస్తావించారు. ఉక్కు కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మాటిచ్చారు. 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు'తో స్టీల్ ప్లాంట్‌ని సాధించుకున్నామని వ్యాఖ్యానించారు. 32 మంది ప్రాణత్యాగాలతో స్టీల్ ప్లాంట్ ఏర్పడిందని ప్రస్తావించారు.





**అపోహలు సృష్టించొద్దు..**

ఈ ఘటనపై కార్మిక సంఘాల నేతలు కావాలని అపోహలు సృష్టిం చొద్దని అన్నారు. 24 గంటలు గడవక ముందే ఇలా మాట్లాడటం భావ్యం కాదని చెప్పారు. విశాఖ ఉక్కును కాపాడాలని కార్మికులు తమను కోరుతున్నారని అన్నారు. విశాఖ ఉక్కుకు పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. ఉత్తరాంధ్రలో పెద్దఎత్తున కంపెనీలు వస్తున్నాయని వివరించారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో విశాఖ స్టీల్‌కు సంక్షోభం వస్తే.. ఆనాడు మనం కాపాడుకున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు.

**జగన్‌పై సెటైర్లు..**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి లోకేశ్ చురకలు అంటించారు. 'ఇంత భారీ ప్రమాదం జరిగితే ఇక్కడకు ప్రతిపక్ష టీమ్ లెవెన్ నుంచి కెప్టెన్ వచ్చారా..?. టీం లెవెన్ కెప్టెన్‌కు సమాధానం చెప్పాల్సిన అవసరం మాకు లేదు. మాకు 124 స్థానాలు ఇచ్చిన ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మాకు ఉంది. పరదాలు కట్టుకొని వెళ్లే వారికి కాదు' అని లోకేశ్ సెటైర్లు గుప్పించారు.

## కాంగ్రెస్ హయాంలో స్కాములు.. మోదీ హయాంలో అభివృద్ధి : ప్రహ్లాద్ జోషి



**తిరుపతి, (రాజధాని వార్తలు):** దేశ క్షేమం కోసం ఆపరేషన్ సిందూర్‌లాంటి కీలక నిర్ణయాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేశారని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి వ్యాఖ్యానించారు. నేటితో ప్రధానిగా మోదీ 4399 రోజులు పూర్తి చేసుకున్న రోజు అని ప్రస్తావించారు. మంగళవారం తిరుపతిలో ప్రహ్లాద్ జోషి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. విజనరీ లీడర్ చంద్రబాబు నాయకత్వంలో కూటమి రెండేళ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. జవాహర్‌లాల్ నెహ్రూ ఇప్పటివరకు అత్యధిక రోజులు ప్రధానిగా ఉన్న రికార్డు ఉందని గుర్తు చేశారు. ఒకప్పుడు కాంగ్రెస్ మాత్రమే సుస్థిర ప్రభుత్వం ఇస్తోందనే రోజులు ఉండేవని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ హయాంలో స్కాములు మాత్రమే ఉండేవని ఆరోపించారు. మోదీ హయాంలో దేశంలో అభివృద్ధి జరుగుతోందని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు.

**కాంగ్రెస్ హయాంలో రూ.6 లక్షల కోట్లు స్కాములు..**

కాంగ్రెస్ హయాంలో గతంలో రూ. 6 లక్షల కోట్ల స్కాములు జరిగాయని ప్రహ్లాద్ జోషి ప్రస్తావించారు. స్కిల్, స్కేల్, ఈ రోజు ఎన్ని సమస్యలు ఉన్నా.. అత్యంత వేగంగా ఆర్థిక ఎదుగుదల సాధిస్తున్న దేశం మనదని చెప్పుకొచ్చారు. 25 కోట్ల మంది భారతీయులు మల్టీ డైమెన్షనల్‌గా రూపుదిద్దుకుంటున్నారని వెల్లడించారు. 81 కోట్ల మందికి ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. ఆహార సరఫరా జియో ట్యాగింగ్ చేసే పైలెట్ ప్రాజెక్ట్ ఏపీలో జరుగుతోందని తెలిపారు. కోట్లాది మందికి జన్‌ధన్ అకౌంట్‌లు ప్రారంభించడంతో డిజిటల్ ట్రాన్స్‌క్షన్ పెరిగిందని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు.

**ఉపాధి కల్పన పెరిగింది..**

లక్షలాది కిలోమీటర్ల నేషనల్ హైవేలతో ఉపాధి కల్పన పెరిగిందని ప్రహ్లాద్ జోషి వివరించారు. విద్యుత్ ఉత్పత్తి ఎక్కువగా ఉన్న రెండో దేశం మనదని చెప్పారు. తాము సన్ పవర్‌తో ముందుకెళుతున్నామని.. కాంగ్రెస్ సన్ కోసం పనిచేస్తోందని ఎద్దేవా చేశారు. పవర్ సర్ ప్లస్‌లో భారత్ ముందంజలో ఉందని చెప్పుకొచ్చారు. సగం రోజులు ఇండియాలో.. మిగిలిన రోజులు విదేశాల్లో ఉండేవారే 'సర్'కు భయపడుతున్నారని ప్రహ్లాద్ జోషి విమర్శించారు.




## యువత పెద్ద కలలు కనండి.. పట్టుదలతో కృషి చేస్తే ఏ లక్ష్యమైనా సాధ్యం : గవర్నర్ నజీర్



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రస్తుత కాలంలో డిజిటల్ పరివర్తన, కృత్రిమ మేధస్సు ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోందని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. ఉన్నత విద్యాసంస్థలు సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించి విద్యార్థులను భవిష్యత్తు సవాళ్లకు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలంటే డిజిటల్ విద్యను విస్తృతంగా వినియోగించాలని తెలిపారు. మంగళవారం నెల్లూరు జిల్లాలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవ సభకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.

**ఉన్నత స్థానాలను సాధించాలి..**

విశ్వవిద్యాలయం గత పదిహేడేళ్లుగా నాణ్యమైన విద్య, పరిశోధన, సామాజిక సేవల ద్వారా విశేష ప్రగతి సాధించిందని గవర్నర్ అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయం ఇటీవల నాక్ నుంచి 3.23 సీజీపీఏతో 'ఏ' గ్రేడ్ సాధించడం గర్వకారణమని ప్రశంసించారు. ఈ విజయంతో జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానాలను సాధించే సామర్థ్యం విశ్వవిద్యాలయానికి ఉందని తెలిపారు. ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ కింద రూ. 20 కోట్ల నిధులు మంజూరయ్యాయని ప్రస్తావించారు. డీప్ ఓషన్ మిషన్ కార్యక్రమం కింద మెరైన్ బయాలజీ విభాగానికి రూ. 4.12 కోట్ల గ్రాంట్ లభించడం విశ్వవిద్యాలయ అభివృద్ధికి కొత్త అవకాశాలను కల్పించిందని వివరించారు.

**కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి..**

ఈ నిధుల ద్వారా పరిశోధన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ విద్య, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి మరింత ఊతమిస్తోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయం చేపడుతున్న జాతీయ సేవా పథకం కార్యక్రమాలు, గ్రామీణాభివృద్ధి, కమ్యూనిటీ డెవలప్‌మెంట్, కాలేజ్- టు - విలేజ్, ల్యాబ్ - టు - ల్యాండ్ వంటి కార్యక్రమాలను అభినందిస్తున్నానని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. విద్యార్థులు తమ వృత్తి జీవితంలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు. కరుణ, నిజాయితీ, వినయం, పరస్పర గౌరవం వంటి విలువలను జీవితాంతం పాటించాలని సూచించారు.

**ప్రపంచానికి మీ అత్యుత్తమ కృషిని అందించాలి..**

ఏపీజే అబ్దుల్ కలాం సందేశాన్ని గుర్తు చేస్తూ ప్రపంచానికి మీ అత్యుత్తమ కృషిని అందించాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. అప్పుడు ప్రపంచం కూడా మీకు అత్యుత్తమ అవకాశాలు, గుర్తింపు, విజయాలను తిరిగి అందిస్తోందని తెలిపారు. యువత పెద్ద కలలు కనాలని, పట్టుదలతో కృషి చేస్తే ఏ లక్ష్యమైనా సాధించగలరని చెప్పుకొచ్చారు. విద్యే సమాజ మార్పునకు అత్యంత శక్తివంతమైన ఆయుధమని ఉద్ఘాటించారు. విద్యా రంగం, పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించే వర్క్‌షాప్‌లు, సెమినార్లు, సదస్సులు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. తమ జ్ఞానం, నైపుణ్యాలను సమాజ శ్రేయస్సు కోసం వినియోగించి దేశ అభివృద్ధికి తోడ్పడాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు.

## గోదావరి కాలుష్యంపై పవన్ స్పందన అభినందనీయం: సోము వీర్రాజు

**రాజమండ్రి, (రాజధాని వార్తలు):** గోదావరి కాలుష్యంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించిన తీరు అభినందనీయమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గోదావరిని కాలుష్యం నుంచి కాపాడేందుకు ఆంధ్రా పేపర్ మిల్, రాజమండ్రి నగరపాలక సంస్థ అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని పవన్ ఆదేశించారన్నారు. పేపర్ మిల్ కాలుష్యం కోసం మాట్లాడితే బ్లాక్ మెయిల్ చేస్తారనే వాదన ఎప్పటినుంచో ఉందని తెలిపారు. డైనమిక్ లీడర్ పవన్ కల్యాణ్ పేపర్ మిల్ కాలుష్యం నివారణ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. గోదావరి ప్రక్షాళనకు ఏడాదికి రూ. 400 కోట్లు చొప్పున కేంద్రం ప్రకటించిందని వెల్లడించారు. రూ. 100 కోట్లు నిధులు మంజూరు అయ్యాయన్నారు. గోదావరి పుష్కరాల కోసం 290 గ్రామాలను అభివృద్ధి చెయ్యాలని తెలిపారు. మునికూడలిలో ఘాట్ నిర్మాణం జరుగుతోందన్నారు. అత్యధిక కాలం ప్రధానిగా ఉన్న మోదీ పాలన స్ఫూర్తిగా ప్రధాన నగరాల్లో, పట్టణాల్లో ప్రధాని మోదీ పేరుతో పూజలు నిర్వహిస్తున్నామని సోము వీర్రాజు పేర్కొన్నారు.





# కరపలో కోలాటానికి విశేష ఆదరణ

## - కరప 'సీతారామ నాట్యమండలి' కోలాటం ప్రదర్శన





**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ కరప మండలంలోని నిలయ తోట రామాలయం ఆవరణలో చాగల రోహిణి కుమార్ సమాజం ఆధ్వర్యంలో 'సీతారామ నాట్యమండలి'గా కోలాట నృత్య ప్రదర్శనకు శ్రీకారం చుట్టారు. ప్రాచీన హిందూ సంప్రదాయ నృత్యరూపమైన కోలాటాన్ని ప్రజల మదిలో నిలిపేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం, స్థానిక దుర్గామాత ఆలయంలో గజ్జల పూజ నిర్వహించిన అనంతరం నక్షత్ర లేఅవుట్ గ్రౌండ్లో కోలాట ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున ప్రజలు హాజరై యువత ప్రదర్శనకు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా గురువు రోహిణి కుమార్ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆధ్వర్యంలో హిందూ సంప్రదాయాల పరిరక్షణకు అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాటిలో భాగంగా కర్ణాటక వాగ్గేయ కారుడు శ్రీ పురందరదాసు కీర్తనల ప్రచారానికి 'దాస సాహిత్య కార్యక్రమం కొనసాగుతోందన్నారు. పగడాల ఆనంద తీర్థాచార్యుల మార్గదర్శకత్వంలో యువతలో ఆధ్యాత్మికత పెంపొందుతోందని అభి ప్రాయపడ్డారు. గత 25 సంవత్సరంలలో ఉభయ గోదావరి జిల్లాల్లో 655కు పైగా కోలాట సమాజాల ఏర్పాటులో 20 మందికి పైగా గురువులను సమన్వయపర్చిన పగడాల ఆనంద తీర్థాచార్యుల కృషి ప్రశంసనీయం అని ఆయన తెలిపారు. ఈ క్రమంలో గురువులు జి.దుర్గాప్రసాద్, ఎస్.శేఖర్ పర్యవేక్షణలో 655వ కోలాట సమాజంగా 'సీతారామ నాట్య మండలి' ఏర్పాటు చేశారు.

యువత ప్రతి రోజు సాయంత్రం 7 గంటల నుంచి 10 గంటల వరకు 100 రోజుల పాటు శిక్షణ పొందారు. వారి శ్రమ ఫలితంగా ప్రదర్శించిన కోలాటం ప్రేక్షకు లను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాల్గొన్న యువతకు పెద్దలు ఆశీస్సులు అందజేశారు.

# మహిళల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు : సానా సతీష్

**విజయవాడ, (రాజధాని వార్తలు):** సొంత తల్లి, చెల్లికి వెన్నుపోటు పొడిచిన వ్యక్తి మహిళల గౌరవం గురించి మాట్లాడటం అత్యంత హాస్యాస్పదమని, ఆయనకు ఆ నైతిక హక్కు లేదని టీడీపీ రాజ్య సభ అభ్యర్థి సానా సతీష్ తీవ్రంగా విమర్శించారు. మంగళవారం విడుదల చేసిన వీడియో ప్రకటనలో ఆయన వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి తీరుపై మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో 11 మందికి రాజ్యసభ సభ్యత్వాలు ఇచ్చినా, కనీసం ఒక్క మహిళకైనా అవకాశం ఇవ్వలేదని గుర్తు చేశారు. మహిళల పట్ల నిజమైన గౌరవం ఉంటే అప్పుడే చూపించాల్సిందని అన్నారు. పదవులు పంచేటప్పుడు మహిళలను పట్టించుకోని జగన్, ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం మహిళల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. "అప్పుడు మహిళలు గుర్తుకు రాని జగన్‌కు, ఇప్పుడు మహిళా సాధికారత గురించి మాట్లాడే నైతికత ఎక్కడిది?" అని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తామని మహానాడు వేదికగా తెలుగుదేశం పార్టీ ప్రకటించినప్పటి నుంచి జగన్ దిక్కుతోచని స్థితిలో ఉన్నారని సతీష్ పేర్కొన్నారు. మహిళా ఓటు బ్యాంకును ఆకట్టుకునేందుకు అబద్ధపు ప్రచారాలకు తెరలేపారని ఆరోపించారు. సొంత తల్లిని విశాఖలో రాజకీయంగా ఓడించడం, చెల్లిని రాజీనామా చేయించడం వంటి ఘటనలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కుటుంబ సభ్యులకే గౌరవం ఇవ్వలేని వ్యక్తి రాష్ట్ర మహిళల గురించి మాట్లాడటం ప్రజలను మభ్యపెట్టడమేనని విమర్శించారు. మహిళల సాధికారత, భద్రత, ఆర్థిక అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుం




దని సానా సతీష్ స్పష్టం చేశారు.

# రెవెన్యూ ఉద్యోగి మృతికి ఉద్యోగ సంఘాల నిరసన

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం నియోజవర్గ స్థాయిలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామ సచివాలయ ఉద్యోగులు ఇటీవల కర్నూలు జిల్లాలో అధికారులు ఒత్తిడి వల్ల గ్రామ రెవెన్యూ అధికారి మహమ్మద్ హుస్సేన్ ఆత్మ హత్య చేసుకున్న సంఘటనకు సంఘీభావంగా డా.అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. అనంతరం అక్కడి నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఉన్న పరి పాలన అధికారి మాధవరావుకు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు కింద స్థాయిలో ఉద్యోగులపై జరుగుతున్న పనిఒత్తిడి గురించి వివరించి, ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకుని వెళ్ళమని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు శ్రీనివాసు, వీరమల్ల లోవరాజు, డివిడి



ప్రసాద్, విజయ్ కుమార్ కిరణ్, వెంకటేశ్వరరావు, ఖాదర్ వల్లి, మేడిశెట్టి వెంకటరమణ, మహమ్మద్ ఆలీ బెగ్, వాసు, స్వప్న, అధిక సంఖ్యలో ఉద్యోగులు హాజరయ్యారు.



# నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి చంద్రబాబు

## - 10, 11 తేదీల్లో ఢిల్లీలోనే ఉండనున్న ముఖ్యమంత్రి
## - ఎన్డీఎ, నీతి ఆయోగ్ సమావేశాల్లో పాల్గొననున్న సీఎం

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటనుకు ఢిల్లీ వెళుతున్నారు. జూన్ 10, 11వ తేదీల్లో సీఎం ఢిల్లీలో ఉండనున్నారు. 10వ తేదీ బుధవారం ఉదయం 11.30 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ఢిల్లీ బయలుదేరి వెళతారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశానికి సీఎం చంద్రబాబు హాజరవుతారు. మధ్యాహ్నం 3.00 గంటల నుంచి రాత్రి 9.00 గంటల వరకు జరిగే ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. 11వ తేదీ గురువారం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఉదయం 9.15 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు సీఎం కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఢిల్లీ నుంచి బయలుదేరి రాత్రి 9.00 గంటలకు అమరావతి చేరుకుంటారు.

# రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు దుర్మరణం

## - పెళ్లి చూపులకు వెళ్లి వస్తుండగా ప్రమాదం





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** గొల్లప్రోలు మండలం చేబ్రోలు సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సామర్లకోట పట్టణంలోని అప్పయ్య చెరువు ప్రాంతానికి చెందిన దంపతులు మృతి చెందారు. మృతులను జి రెడ్డి వెంకట సూర్యనారాయణ (45), జి రెడ్డి అరుణకుమారి (40) గా పోలీసులు గుర్తించారు. సూర్యనారాయణ దంపతులు తమ సోదరుని కుమార్తె పెళ్లి చూపులకు గొల్లప్రోలు సమీప లోవ కొత్తూరు వద్ద తాళ్లూరు గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. మిగిలిన బంధువులు కారులో వస్తుండగా, భార్యాభర్తలు మోటార్ సైకిల్‌పై సామర్లకోటకు తిరుగు ప్రయాణం అయ్యారు. కారులో బంధువులు మార్గమధ్యలో భోజనానికి ఆగగా, దంపతులు ఇద్దరు మోటార్ సైకిల్‌పై సామర్లకోట బయలుదేరారు. మృతులకు ఒక కుమార్తె ఉండగా ఆమె రాజమండ్రిలోని ఒక కళాశాలలో మెడిసిన్ సంభంధిత విద్య అభ్యసి స్తోంది. గొల్లప్రోలు మండలం దుర్గాడ రోడ్డు జంక్షన్ సత్తెమ్మ తల్లి గుడి సమీపాన ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో లారీ అతివేగంగా మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో భార్యాభర్తలు మృతి చెందారు.

అతివేగంగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో దంపతులు మృతి చెందడంతో సామర్లకోట అప్పయ్య చెరువు ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. భోజనానికి ఆగిన ప్రాణాలు నిలిచేవని మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు శోక సంద్రంలో మునిగిపోయారు.

# కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ "మీడియా ప్రచార" కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నంలో డీజీఎఫ్‌టీ ప్రాంతీయ పర్యటన

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** కొత్తగా ప్రారంభించిన ఎగుమతి ప్రోత్సాహక మిషన్‌పై దృష్టి సారించి, విశాఖపట్నంలోని జాయింట్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) కార్యాలయం ఆధ్వర్యంలో ఈరోజు విశాఖపట్నంలోని నోవోటెల్ హోటల్ లో "ఎగుమతిదారుల అవగాహన సదస్సు" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర విదేశీ వాణిజ్య డైరెక్టర్ జనరల్ (డీజీఎఫ్‌టీ) లవ్ అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సదస్సులో ఎగుమతిదారులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రతినిధులు, పారిశ్రామిక సంఘాలు, ఈసీజీసీ ప్రతినిధులు పాల్గొన్నారు. భారతదేశ ఎగుమతుల వ్యవస్థను బలోపేతం చేయడం, అంతర్జాతీయ వాణిజ్య సౌలభ్యం కోసం ప్రభుత్వం చేపడుతున్న వివిధ పథకాలపై అవగాహన పెంచడంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ అవగాహన కార్యక్రమంలో డీజీఎఫ్‌టీ, ఈసీజీసీ, ఎమ్ఎస్ఎమ్ఈ కార్యాలయాల నిపుణులు పలు సాంకేతిక అంశాలపై వివరణాత్మక ప్రసంగాలు చేశారు. ప్రపంచ మార్కెట్లలో భారతీయ ఉత్పత్తుల భాగస్వామ్యాన్ని పెంచడానికి డీజీఎఫ్‌టీ పథకాలను ఎలా సమర్థవంతంగా ఉపయోగించుకోవాలో వారు వివరించారు. అనంతరం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సముద్ర మత్స్య సంపద, ఇంజనీరింగ్, మెడ్‌టెక్ ఎగుమతుల రంగాలకు చెందిన పారిశ్రామిక ప్రముఖులు తమ అనుభవాలను సదస్సులో పంచుకున్నారు. ముఖ్య అతిథి డీజీఎఫ్‌టీ లవ్ అగర్వాల్ సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తూ.. ఎగుమతుల ప్రోత్సాహక మిషన్ కింద ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన ప్రాధాన్యతలను వివరించారు. ముఖ్యంగా, మార్చి 1, 2026 నుంచి మే 31, 2026 వరకు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా.. విశాఖపట్నం ప్రాంతీయ అథారిటీ ద్వారా పరిష్కరించిన ఎగుమతి బాధ్యత విముక్తి ధృవీకరణ పత్రం (ఈఓడీసీ) కేసుల పురోగతిని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇలాంటి కేసులను వేగంగా పరిష్కరించడం వల్ల ఎగుమతిదారులు తమ బ్యాంక్ గ్యారంటీలను క్లియర్ చేసుకోవడానికి వీలైందని, తద్వారా వారి నగదు ప్రవాహం పెరిగిందని తెలిపారు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ నుంచి మాత్రమే ఎగుమతిదారులకు దాదాపు రూ.419 కోట్ల మేర లభ్యత పెరిగిందని ఆయన పేర్కొన్నారు. అలాగే, కొత్తగా ప్రారంభించిన ఎగుమతుల ప్రోత్సాహక మిషన్




కింద లభించే అవకాశాలను చురుగ్గా ఉపయోగించుకోవాలని ఎమ్ఎస్ఎమ్ఈ యూనిట్లను ఆయన ప్రోత్సహించారు. ఈ మిషన్ ప్రధానంగా రెండు ముఖ్యమైన అంశాలపై పనిచేస్తుందని వివరించారు. మొదటిది, వాణిజ్య ఆర్థిక సహాయం అందించే 'నిర్యత్ ప్రోత్సాహన్' కాగా, రెండవది అంతర్జాతీయ మార్కెట్లలో ఎదురయ్యే అడ్డంకులను అధిగమించడానికి తోడ్పడే 'నిర్యత్ దిశ'. దీనితో పాటు, జూన్ 1, 2026 న ప్రారంభమైన 'ఎగుమతి కేంద్రాలుగా జిల్లాలు' డ్రైవ్ గురించి కూడా సదస్సులో ప్రముఖంగా ప్రస్తావించారు. ఇది ప్రతి జిల్లా నుంచి నిర్దేశిత ఉత్పత్తుల ఎగుమతులను పెంచడం, వాటిని ఎగుమతి కేంద్రాలుగా మార్చడం లక్ష్యంగా పెట్టుకున్న 90 రోజుల జాతీయ ప్రచార కార్యక్రమం. ఆంధ్రప్రదేశ్ నుండి అనంతపురం, చిత్తూరు, తూర్పుగోదావరి, గుంటూరు, కృష్ణా, విశాఖపట్నం జిల్లాలను ప్రాధాన్యత కలిగిన జిల్లాలుగా ఎంపిక చేశారు. ఈ చొరవ ద్వారా గుర్తించిన జిల్లా ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ అనుసంధానాన్ని బలోపేతం చేయడం, స్థానిక ప్రత్యేక ఉత్పత్తుల గుర్తింపును పెంచడం ద్వారా క్షేత్రస్థాయి ఉత్పత్తిదారులకు, ఎమ్ఎస్ఎమ్ఈలకు కొత్త మార్కెట్ అవకాశాలు లభిస్తాయి. సదస్సులో భాగంగా జరిగిన పరస్పర చర్చా కార్యక్రమంలో ఎగుమతిదారులు, అధికారులు.. ఎగుమతి రంగంలో ఎదురవుతున్న సవాళ్లు, ఆలోచనలను పంచుకున్నారు. ఎగుమతిదారులకు నిరంతరం మద్దతు ఇవ్వడానికి, ఎమ్ఎస్ఎమ్ఈల భాగస్వామ్యాన్ని పటిష్టం చేయడానికి, భారతదేశాన్ని అంతర్జాతీయ తయారీ, ఎగుమతుల కేంద్రంగా మార్చాలనే విజన్‌ను ముందుకు తీసుకెళ్లడానికి డీజీఎఫ్‌టీ కట్టుబడి ఉందనే బలమైన నమ్మకంతో ఈ కార్యక్రమం ముగిసింది.

# ప్రజలకు సేవ చెయ్యడం సీఎం చంద్రబాబు లక్ష్యం

## - నెల్లూరు అభివృద్ధి వేమిరెడ్డితోనే సాధ్యం
## - బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల జనార్ధన్ రావు

**విడవలూరు, (రాజధాని వార్తలు):** ఎన్టీఆర్‌తో మొదలు అయిన సైకిల్ టీడీపీలో ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకొని ప్రజలకు సేవలను సీఎం చంద్రబాబు సైకిల్‌తోనే ఏపీ ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నారని, అదేవిధంగా కోవూరు నియోజకవర్గంని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఎంపీ ప్రభాకర్ రెడ్డిలు కూడా సైకిల్‌ను ఎక్కి ప్రజాక్షేత్రములో పోవడం పట్ల ఎంతో హర్షనీయమైన చర్య అని బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల జనార్ధన్ రావు అన్నారు. వేమిరెడ్డి పుణ్యదంపతులు దాత్రుత్వములో ఇటీవల విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసి మానవత్వం చాటుకొన్నారు. ఇలా వేమిరెడ్డి దంపతులు వారు చేస్తున్న సేవలు ఎనలేనిదని అన్నారు. ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులగా ఉంటూ కూడా సొంత డబ్బుతో అనేక సేవలు చెయ్యడం ప్రజలు చేసుకొన్న అదృష్టం అని వనమాల అన్నారు. పార్టీలకు, కులాలకు అతీతంగా సేవలు




చెయ్యడమే విపిఆర్ లక్ష్యం అని అన్నారు.

# చెస్ టోర్నమెంట్ విజయవంతం...దేశవ్యాప్తంగా, విదేశాల నుండి 943 మంది క్రీడాకారుల భాగస్వామ్యం

**అమరావతి, (రాజధాని వార్తలు):** VIT-AP యూనివర్సిటీ మరియు ఆంధ్ర చెస్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన 'VIT-AP 1వ అమరావతి FIDE రేటింగ్ చెస్ టోర్నమెంట్' జూన్ 8, 2026 సాయంత్రం విజయవంతంగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్‌లో చెస్ మరియు మేధోపరమైన క్రీడల ప్రోత్సాహంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. జూన్ 1, 2026న ప్రారంభమైన ఈ ఎనిమిది రోజుల టోర్నమెంట్‌కు దేశవ్యాప్తంగా విదేశాల నుండి చెస్ క్రీడాకారుల నుండి అద్భుతమైన స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో మొత్తం 943 మంది క్రీడాకారులు (21 రాష్ట్రాలు మరియు 2 దేశాల నుండి) పాల్గొన్నారు. వీరిలో 669 మంది అంతర్జాతీయ రేటింగ్ కలిగిన క్రీడాకారులు, 76 మంది 'టైటిల్' పొందిన క్రీడాకారులు (ఇంటర్నేషనల్ మాస్టర్స్, క్యాండిడేట్ మాస్టర్స్, FIDE మాస్టర్స్, ఇతర ప్రముఖ పోటీదారులు) ఉన్నారు. 4 ఏళ్ల వయస్సు గల చిన్నారుల నుండి అనుభవజ్ఞులైన చెస్ దిగ్గజాల వరకు పాల్గొనడం ద్వారా ఈ టోర్నమెంట్ గొప్ప సమగ్రతను చాటి చెప్పింది. వివిధ విభాగాలలో విజేతలకు నగదు బహుమతులు మరియు ట్రోఫీలు అందజేశారు. మొత్తం రూ. 30 లక్షల నగదు బహుమతిని విజేతలకు పంపిణీ చేశారు. ఈ ఛాంపియన్‌షిప్ అనేకమంది ప్రముఖులు, ప్రజాప్రతినిధుల దృష్టిని ఆకర్షించింది, వారు టోర్నమెంట్ జరుగుతున్న సమయంలో దీనిని సందర్శించారు. జూన్ 1, 2026న జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి డిజిపి, పోలీస్ ఫోర్స్ అధిపతి హరీష్ కుమార్ గుప్తా, యాంటీ-నార్కోటిక్స్ సెల్ ఐజి ఆకే రవి కృష్ణ మరియు గుంటూరు ఎస్పీ వాకుల్ జిందాల్ హాజరై టోర్నమెంట్‌ను అధికారికంగా ప్రారంభించారు.

తదుపరి సందర్శనలు:




జూన్ 3, 2026: గౌరవనీయులైన క్రీడలు, యువజన వ్యవహారాలు మరియు రవాణా శాఖ మంత్రి ఎం.రామ్ ప్రసాద్ రెడ్డి. జూన్ 4, 2026: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ రవి నాయుడు. జూన్ 5, 2026: గౌరవనీయులైన బిసి సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత; వీరు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. తరువాత రోజు, గౌరవనీయులైన కార్మిక, ఫ్యాక్టరీల మంత్రి వాసంశెట్టి సుభాష్.

జూన్ 6, 2026: చైర్‌పర్సన్, ఏపి మహిళా కమిషన్, రాయపాటి శైలజ; డైరెక్టర్, AIIMS మంగళగిరి, డా.అహంతేమ్ శాంతా సింగ్; మరియు చీఫ్ ఇంజనీర్, ూాజ=ణూ, వీ. వెంకటేశ్వరరావు. జూన్ 7, 2026: కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్, గుంటూరు, సి.ఎం. సాయికాంత్ వర్మ. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విఐటి-ఏపి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా.పి.అరుళ్మొళివర్మన్ మాట్లాడుతూ, "మొదటి అమరావతి ఫిడే రేటింగ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌కు లభించిన అద్భుతమైన స్పందనకు మేము చాలా సంతోషిస్తున్నాము. దేశం నలు మూలల నుండి, విదేశాల నుండి దాదాపు వెయ్యి మంది క్రీడాకారులను ఒకచోట చేర్చడం, విద్యా, క్రీడలు ,సంపూర్ణ అభివృద్ధిలో శ్రేష్ఠతకు కేంద్రంగా విఐటి-ఏపి యొక్క పెరుగుతున్న స్థాయిని ప్రతిబింబిస్తుంది. ప్రతిభ, వ్యూహాత్మక ఆలోచన, అంతర్జాతీయ క్రీడా ప్రమాణాలను పెంపొందించే కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడానికి మేము కట్టుబడి ఉన్నాము." విఐటి-ఏపి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, గౌరవ అతిథి డా.జగదీష్ చంద్ర వ్యాఖ్యానిస్తూ: "ఇంతటి భారీ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించడం అనేది మా నిర్వాహక కమిటీలు, వాలంటీర్లు, అధ్యాపకులు, సిబ్బంది, భాగస్వాముల యొక్క నిశితమైన ప్రణాళిక, సమష్టి కృషి, అంకితభావానికి నిదర్శనం. ఈ కార్యక్రమాన్ని ఒక చిరస్మరణీయ విజయంగా మలచడంలో తమ ఉనికి, ప్రోత్సాహంతో దోహదపడిన పాల్గొన్న వారందరికీ, అధికారులకు మరియు ప్రముఖులకు మేము కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము." కె.వి.వి. ఆంధ్ర చెస్ అసోసియేషన్ చైర్మన్ శర్మ తన ప్రశంసలను




వ్యక్తం చేస్తూ ఇలా అన్నారు: "మొదటి అమరావతి ఫిడే రేటింగ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ ఆంధ్రప్రదేశ్‌లోని చెస్ ఈవెంట్‌లకు ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పింది. VIT-AP విశ్వవిద్యాలయం అందించిన అద్భుతమైన మౌలిక సదుపాయాలు, ఆతిథ్యం, సంస్థాగత మద్దతు క్రీడాకారులకు ఒక అత్యుత్తమ పోటీ వాతావరణాన్ని సృష్టించాయి. ఈ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసి, భారతదేశ చెస్ క్యాలెండర్‌లో అమరావతిని ఒక ప్రముఖ గమ్యస్థానంగా తీర్చిదిద్దాలని మేము ఆశిస్తున్నాము." ఈ టోర్నమెంట్, ఔత్సాహిక ,వృత్తిపరమైన చెస్ క్రీడాకారులకు ఫిడే రేటింగ్ పాయింట్లను సంపాదించుకోవడానికి ఒక విలువైన వేదికను అందించడమే కాకుండా, క్రీడా నైపుణ్యానికి ,మేధో పోటీకి ఒక ముఖ్యమైన కేంద్రంగా అమరావతి ఆవిర్భావాన్ని కూడా బలపరిచింది. ఆంధ్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ మాట్లాడుతూ, "భారతదేశం నలుమూలల నుండి ,విదేశాల నుండి అద్భుతమైన భాగస్వామ్యం, చెస్ యొక్క పెరుగుతున్న ప్రజాదరణను, ఈ టోర్నమెంట్‌పై చెస్ కమ్యూనిటీ ఉంచిన నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. ఇంతటి ఉన్నత ప్రమాణాలతో కూడిన కార్యక్రమాన్ని అందించడానికి మాతో భాగస్వామ్యం అయినందుకు VIT-AP విశ్వవిద్యాలయానికి మేము కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఈ టోర్నమెంట్ అన్ని వయసుల క్రీడాకారులకు పోటీ పడటానికి, నేర్చుకోవడానికి, వారి చెస్ ప్రయాణంలో పురోగతి సాధించడానికి ఒక అద్భుతమైన వేదికను అందించింది." అని అన్నారు. ఈ సందర్భంగా VIT-AP విశ్వవిద్యాలయం విద్యార్థి సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఖదీర్ పాషా, శారీరక విద్య డైరెక్టర్ డాక్టర్ ఎన్.రామచంద్రరావు, ఆంధ్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి జగదీష్ కూడా పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం - పారదర్శక పరిపాలనే మా లక్ష్యం

## - సాంకేతిక సంస్కరణలతో దేశానికే ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లైస్ శాఖ : రాష్ట్ర ఆహార & పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్







**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో రైతు సంక్షేమాన్ని కేంద్ర బిందువుగా తీసుకుని, పారదర్శకత, సాంకేతికత, వేగవంతమైన సేవల సమన్వయంతో సివిల్ సప్లైస్ శాఖ గత రెండు సంవత్సరాల్లో చారిత్రాత్మక సంస్కరణలను అమలు చేసి దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర ఆహార & పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రైతు ఎక్కడా ఇబ్బందులు పడకుండా, ధాన్యం కొనుగోళ్లలో సంపూర్ణ పారదర్శకత, తక్షణ చెల్లింపులు, మధ్యవర్తుల నిర్మూలన, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో, ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అధికారులు, రైతు సహాయక కేంద్రాల సిబ్బంది, వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ మరియు అనుబంధ శాఖల సమన్వయంతో ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు.

**రైతుకు ప్రథమ ప్రాధాన్యత...**

రైతు కష్టపడి పండించిన ప్రతి గింజకు గౌరవం దక్కేలా, ధాన్యం విక్రయంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టిందన్నారు. రైతు సంక్షేమాన్ని కేంద్రబిందువుగా తీసుకుని, పారదర్శకత, వేగవంతమైన చెల్లింపులు, సాంకేతిక ఆధారిత సేవలతో దేశంలోనే ఆదర్శవంతమైన ధాన్యం కొనుగోలు విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 17.97 లక్షల మంది రైతుల నుండి 1.29 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో సుమారు రూ.30,361 కోట్ల విలువైన ధాన్యం కొనుగోళ్లు నిర్వహించి, రైతులకు సకాలంలో చెల్లింపులు చేయడం జరిగిందన్నారు. రైతులకు చెల్లింపుల విషయంలో అత్యంత వేగవంతమైన విధానాన్ని అమలు చేస్తూ, 90 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేయగా, మిగిలిన చెల్లింపులు కూడా 48 గంటలు దాటకుండా పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. రైతులు ఎక్కడా ఇబ్బందులు పడకుండా, చెల్లింపుల్లో జాప్యం లేకుండా, పూర్తి పారదర్శకతతో ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

**సాంకేతిక సంస్కరణలు - దేశంలోనే తొలిసారి వాట్సాప్ ద్వారా ధాన్యం విక్రయం:**

రైతులకు మరింత సులభమైన, పారదర్శకమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ ఆధారిత ధాన్యం నమోదు మరియు విక్రయ విధానాన్ని అమలు చేసినట్లు తెలిపారు. ఈ వినూత్న వ్యవస్థ ద్వారా రైతులు ఎటువంటి మధ్యవర్తుల అవసరం లేకుండా నేరుగా తమ ధాన్యాన్ని నమోదు చేసి విక్రయించే అవకాశం పొందుతున్నారన్నారు. ఇప్పటికే 40 వేల మందికి పైగా రైతులు ఈ విధానాన్ని వినియోగించుకుని సుమారు 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నేరుగా సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌కు విక్రయించినట్లు ఆయన తెలిపారు. ఈ సంస్కరణ ద్వారా మధ్యవర్తుల జోక్యం గణనీయంగా తగ్గడమే కాకుండా, రైతులకు పారదర్శక వ్యవస్థలో నేరుగా లాభం చేకూరిందని ఆయన పేర్కొన్నారు.

**వర్షాలు - తుఫానుల సమయంలో రైతులకు రక్షణ:**

వర్షాకాలంలో ధాన్యం తడవకుండా కాపాడేందుకు దేశంలోనే తొలిసారిగా చిన్న, సన్నకారు రైతులకు రూ.50 కోట్లు విలువైన టార్పాలిన్లు ఉచిత పంపిణీ చేసినట్లు మంత్రి తెలిపారు. తుఫానులకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి రైతు సహాయక కేంద్రాల ద్వారా ఈ సేవలు అందించామని పేర్కొన్నారు.

**"దీపం--2" పథకం -- కోట్లాది కుటుంబాలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల లబ్ధి:**

"దీపం-2" పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హులైన కుటుంబాలకు సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలోని 1.08 కోట్ల గ్యాస్ కనెక్షన్లను లక్ష్యంగా తీసుకుని అమలు చేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా కుటుంబాలపై గ్యాస్ వ్యయభారం తగ్గించి, సాధారణ ప్రజలకు ఆర్థిక ఊరటనందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ పథకం కింద ఇప్పటివరకు పలు విడతల్లో భారీ స్థాయిలో సబ్సిడీని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. మొదటి విడతలో 97.36 లక్షల సిలిండర్లకు రూ.764 కోట్ల సబ్సిడీ, రెండో విడతలో 93.83 లక్షల సిలిండర్లకు రూ.777 కోట్లు, మూడో విడతలో 94.81 లక్షల సిలిండర్లకు రూ.791 కోట్లు, నాలుగో విడతలో 92.28 లక్షల సిలిండర్లకు రూ.760 కోట్ల రాయితీ నేరుగా ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఐదో విడత అమలుకు ఇప్పటికే ఆయిల్ మార్కెటింగ్ సంస్థలకు రూ.300 కోట్లు అడ్వాన్సుగా విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. దేశంలోనే అత్యంత విస్తృత స్థాయిలో అమలవుతున్న సంక్షేమ పథకాలలో "దీపం-2" ఒకటిగా నిలిచి, కోట్లాది కుటుంబాలకు ప్రత్యక్ష ఆర్థిక లబ్ధి చేకూరుస్తోందని మంత్రి తెలిపారు.

**స్మార్ట్ రేషన్ కార్డులు - వినూత్న డిజిటల్ సంస్కరణ:**

ప్రజలకు మరింత పారదర్శకమైన, సులభమైన మరియు సాంకేతిక ఆధారిత సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వినూత్న డిజిటల్ సంస్కరణగా క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.49 కోట్ల కుటుంబాలకు ఈ స్మార్ట్ కార్డులు అందజేసినట్లు తెలిపారు. "One Nation - One Ration Card" విధానంలో భాగంగా రాష్ట్రంలోని ఏ రేషన్ దుకాణంలోనైనా లబ్ధిదారులు తమకు కేటాయించిన సరుకులను పొందే విధంగా ఈ వ్యవస్థను రూపొందించినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల వివరాలను డిజిటల్ రూపంలో సమగ్రంగా పొందుపరిచిన ఈ కార్డులు ూావీ కార్డు తరహాలో సులభ వినియోగానికి అనుకూలంగా ఉండటంతో పాటు, రేషన్ పంపిణీలో పారదర్శకతను మరింత పెంచాయని తెలిపారు. సాంకేతికతను ప్రజా సంక్షేమంతో అనుసంధానిస్తూ, దళారుల జోక్యానికి అవకాశం లేకుండా, నిజమైన లబ్ధిదారులకు సేవలు చేరే విధంగా అమలు చేస్తున్న ఈ స్మార్ట్ రేషన్ కార్డులు దేశంలోనే ఒక ఆదర్శవంతమైన సంస్కరణగా నిలిచిందని ఆయన తెలిపారు.

**వృద్ధులు --దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సేవ:**

సామాజిక భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ, దేశంలోనే తొలిసారిగా వృద్ధులు మరియు దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేసే వినూత్న కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16.88 లక్షల మంది వృద్ధులు, దివ్యాంగులకు ఈ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, రేషన్ డీలర్లు E-POS పరికరాలతో నేరుగా వారి ఇళ్ల వద్దకు వెళ్లి బయోమెట్రిక్ ధృవీకరణ అనంతరం సరుకులు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా వృద్ధులు, దివ్యాంగులు ఎదుర్కొనే ఇబ్బందులు గణనీయంగా తగ్గడమే కాకుండా, సంక్షేమ సేవలను మరింత గౌరవప్రదంగా, సులభంగా అందించే దిశగా ప్రభుత్వం ముందడుగు వేసిందని తెలిపారు. సాంకేతికతను మానవీయ దృక్పథంతో అనుసంధానిస్తూ అమలు చేస్తున్న ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందని తెలిపారు.

**సూపర్ ఫైన్ రైస్ - విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం:**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మరింత నాణ్యమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో, డొక్కా సీతమ్మ పేరుతో సూపర్ ఫైన్ రైస్‌తో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ వినూత్న నిర్ణయం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు మరియు సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న లక్షలాది విద్యార్థులకు మెరుగైన నాణ్యత గల బియ్యం అందుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని రైతుల వద్ద నుంచి సుమారు 2.25 లక్షల క్వింటాళ్ల సూపర్ ఫైన్ రైస్ సేకరించి, 25 కిలోల ప్యాకెట్ల రూపంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 41 వేల ప్రభుత్వ పాఠశాలలు మరియు 4 వేల సంక్షేమ హాస్టళ్లకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ బియ్యం సంచులపై రైతుల వివరాలను ముద్రించడం ద్వారా రైతుకు గౌరవం కల్పించడంతో పాటు, వ్యవసాయం మరియు విద్యా సంక్షేమాన్ని అనుసంధానించే ప్రత్యేక కార్యక్రమంగా దీన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, రైతులకు మెరుగైన మద్దతు అనే ద్వంద లక్ష్యాలతో అమలు చేస్తున్న ఈ కార్యక్రమం దేశంలోనే ఒక వినూత్న సంస్కరణగా నిలిచిందని ఆయన స్పష్టం చేశారు.

**పారదర్శకతలో ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ గుర్తింపు:**

రేషన్ పంపిణీ వ్యవస్థలో పూర్తి పారదర్శకత, నిజమైన లబ్ధిదారుల గుర్తింపు మరియు సాంకేతిక ఆధారిత పరిపాలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జుఖ్జ ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్ దేశవ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు. రాష్ట్రంలోని రేషన్ కార్డులలో 99.06 శాతం జుఖ్జ విజయవంతంగా పూర్తి చేసి, దేశంలోనే అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందినట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా చేయడమే కాకుండా, పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన మరియు డిజిటల్ సంస్కరణల అమలులో రాష్ట్ర ప్రభుత్వం మరో మైలురాయిని సాధించిందని పేర్కొన్నారు.

**అక్రమాలపై ఉక్కుపాదం - పారదర్శక పంపిణీ వ్యవస్థకు కట్టుదిట్టమైన చర్యలు:**

ప్రజలకు అందాల్సిన సంక్షేమ సరుకులు దారి మళ్లకుండా, పంపిణీ వ్యవస్థ పూర్తిగా పారదర్శకంగా కొనసాగేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోందని తెలిపారు. అక్రమ రవాణా, నిల్వలు మరియు దుర్వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ చర్యల్లో భాగంగా ఇప్పటివరకు 5,354 కేసులు నమోదు చేయగా, 7,32,675 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా, ప్రభుత్వం ఖర్చు చేస్తున్న ప్రతి రూపాయి నిజమైన లబ్ధిదారులకే చేరేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని స్పష్టం చేశారు. పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన మరియు అవినీతి రహిత పంపిణీ వ్యవస్థ లక్ష్యంగా ప్రభుత్వం రాజీ లేకుండా చర్యలు కొనసాగిస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

**గత ప్రభుత్వ బకాయిల చెల్లింపు - రైతులకు ఆర్థిక ఊరటనిచ్చిన ప్రభుత్వం:**

గత ప్రభుత్వ కాలంలో రైతులకు చెల్లించాల్సి ఉండి పెండింగ్‌లో ఉన్న వేల కోట్ల రూపాయల బకాయిలను ప్రస్తుత ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుని విడుదల చేసినట్లు తెలిపారు. రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా, వారికి రావాల్సిన నిధులు సకాలంలో అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఈ క్రమంలో ఒక విడతలో రూ.1000 కోట్లు, మరో విడతలో రూ.674 కోట్లు రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు వెల్లడించారు. రైతుల పట్ల ప్రభుత్వ నిబద్ధతను చాటుతూ, పెండింగ్ బకాయిల సమస్యను పరిష్కరించడం ద్వారా రైతాంగానికి ఆర్థిక భరోసా కల్పించామని పేర్కొన్నారు.

**భవిష్యత్ లక్ష్యాలు - పోషకాహారం, సాంకేతిక సేవలకు మరింత ప్రాధాన్యత :**

ప్రజలకు మరింత నాణ్యమైన, పోషక విలువలతో కూడిన సరుకులు అందించడంతో పాటు సాంకేతిక ఆధారిత సేవలను విస్తరించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. భవిష్యత్తులో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా మిల్లెట్స్ పంపిణీ చేపట్టడంతో పాటు, పామ్ ఆయిల్ మరియు సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను అందుబాటులోకి తీసుకు రావడానికి చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా వినియోగదారులకు మరింత సులభమైన, పారదర్శకమైన మరియు సాంకేతికత ఆధారిత సేవలు అందించేందుకు కొత్త సంస్కరణలను అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమం, పోషకాహారం మరియు డిజిటల్ సేవల సమన్వయంతో ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**సిబ్బందికి ప్రత్యేక అభినందనలు:**

రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, ధాన్యం కొనుగోళ్లు, పారదర్శక పంపిణీ వ్యవస్థ మరియు సాంకేతిక సంస్కరణల విజయవంతమైన అమలుకు కృషి చేసిన జిల్లా యంత్రాంగం, సివిల్ సప్లైస్ అధికారులు, రైతు సహాయక కేంద్రాల సిబ్బంది, రేషన్ డీలర్లు మరియు సాంకేతిక బృందాలకు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. క్షేత్ర స్థాయిలో అంకితభావంతో పనిచేస్తూ రైతులు, వినియోగదారులకు సమర్థవంతమైన సేవలు అందిస్తున్న ప్రతి ఉద్యోగి ప్రభుత్వ విజయాల్లో భాగస్వామి అని పేర్కొన్నారు.

రైతు సంక్షేమం, వినియోగదారుల రక్షణ మరియు పారదర్శక పరిపాలన అనే మూడు ప్రధాన లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం మరింత సమర్థవంతంగా ముందుకు సాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ కె.కన్నబాబు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డిల్లీ రావు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ప్రాణాంతకమైన వేగం: యువత నిర్లక్ష్యం.. మృత్యుకుహరంగా మారుతున్న రహదారులు

మార్పులు చేసిన సైలెన్సర్ల మితిమీరిన శబ్దం, గంటకు 80 కిలోమీటర్ల వేగంతో వెళ్తూ స్మార్ట్‌ఫోన్ స్క్రీన్‌ను చూడటం, ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు అకస్మాత్తుగా బ్రేకులు వేయడం.. ఇవీ నేడు మన రోడ్లపై రోజువారీగా కనిపిస్తున్న భయంకర దృశ్యాలు. నగరాలైనా, గ్రామాలైనా ఈ మధ్యకాలంలో ఒక ప్రమాదకరమైన ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది: నేటి యువతలో చాలామంది ట్రాఫిక్ నిబంధనలను ప్రాణాలు కాపాడే మార్గదర్శకాలుగా కాకుండా, కేవలం ఒక ఐచ్ఛికంగా (ఆప్షనల్) భావిస్తున్నారు. నేటి యువ సంస్కృతిలో "థ్రిల్" లేదా "స్వేచ్ఛ"గా చలామణి అవుతున్న ఈ నిర్లక్ష్య వైఖరి, సమాజ భద్రతకు పెద్ద ముప్పుగా మారింది. ఈ చట్టరాహిత్యానికి మనం చెల్లిస్తున్న ధర కేవలం ట్రాఫిక్ జామ్‌లు లేదా వాహనాల డ్యామేజీలు మాత్రమే కాదు; అనేకమంది యువతీ యువకుల అమూల్యమైన ప్రాణాలు, వారి కుటుంబాల తీరని వేదన.

**నిర్లక్ష్యపు అంతర్లీన రూపాలు**

ఈ సంక్షోభాన్ని పరిష్కరించాలంటే, మొదట యువతలో ప్రమాదాలకు కారణమవుతున్న నిర్దిష్ట ప్రవర్తనలను మనం గుర్తించి విశ్లేషించాలి.

**స్మార్ట్‌ఫోన్ పరధ్యానం:**

నేటి ప్రయాణాల్లో స్మార్ట్‌ఫోన్ అత్యంత ప్రమాదకరమైన సహ-ప్రయాణికుడిగా మారింది. డ్రైవింగ్ చేస్తూ నోటిఫికేషన్లు చూసుకోవడం, రీల్స్ లేదా వీడియోలు రికార్డ్ చేయడం వల్ల వాహనాన్ని నియంత్రించే సమయం దారుణంగా పడిపోతుంది. ఇది క్షణాల వ్యవధిలో ఘోర ప్రమాదాలకు దారి తీస్తోంది. వేగమే ఒక గౌరవం (స్టేటస్ సింబల్): మితిమీరిన వేగంతో వెళ్లడం, ప్రమాదకరంగా ఓవర్‌టేక్ చేయడాన్ని యువత ఒక గొప్పగా భావిస్తోంది. వేగం ఇచ్చే తాత్కాలిక కిక్ కోసం, వాహనంపై నియంత్రణ కోల్పోతే జరిగే భౌతిక నష్టాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారు.

**రక్షణ కవచాలపై చిన్నచూపు:**

హెల్మెట్‌ను ప్రాణాలు కాపాడే సాధనంగా కాకుండా, కేవలం పోలీస్ చెకింగ్ పాయింట్ల వద్ద తప్పించుకోవడానికి హ్యాండిల్‌కు తగిలించే ఒక వస్తువులా చూస్తున్నారు. అలాగే, కార్లలో సీట్‌బెల్ట్ అలారమ్ శబ్దం రాకుండా ఉండేందుకు చౌకగా దొరికే క్లిప్పులను వాడుతున్నారు. దీనివల్ల వాహనాల్లోని అధునాతన సేఫ్టీ ఎయిర్‌బ్యాగ్‌లు కూడా పనిచేయకుండా పోతున్నాయి. నా ఇష్టం.. నా దారి (రోడ్డు నిబంధనల ఉల్లంఘన): రెడ్ సిగ్నల్ పడినా ఆపకుండా వెళ్లడం, సమయం ఆదా చేసుకోవడానికి రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, కాలినడకన వెళ్లేవారిని (పెడెస్ట్రియన్స్) పట్టించుకోకపోవడం ఒక సాధారణ విషయంగా మారిపోయింది.

**సోషల్ మీడియా ప్రభావం: 'లైక్స్' కోసం లైఫ్ రిస్క్!**

రోడ్డు భద్రతకు సంబంధించి ఇటీవల కాలంలో వచ్చి చేరిన అత్యంత నషాకారకమైన సమస్య సోషల్ మీడియా వ్యామోహం. యువకులు రోడ్లపై ప్రమాదకరమైన స్టంట్లు చేయడం, వాహనాల మధ్య నుంచి వేగంగా దూసుకుపోవడం, అత్యధిక వేగంతో వెళ్తున్న బైక్ స్పీడోమీటర్‌ను రికార్డ్ చేసి ఇంటర్నెట్‌లో పోస్ట్ చేయడం వంటి వీడియోలు నిత్యం చూస్తూనే ఉన్నాం.

తప్పుడు భ్రమలు:ఇటువంటి ప్రమాదకరమైన డ్రైవింగ్‌కు సామాజిక మాధ్యమాల్లో "లైక్స్", "కామెంట్స్", వ్యూస్ రావడం వల్ల యువతలో ఒక తప్పుడు అంచనా ఏర్పడుతోంది. చట్టాన్ని ఉల్లంఘించడం ఒక వీరత్వంగా వారు భావిస్తున్నారు. కానీ, ఒక చిన్న పొరపాటు వల్ల జరిగే ప్రాణాంతక ప్రమాదాన్ని, దానివల్ల కన్నవారికి మిగిలే శోకాన్ని వారు ఊహించలేకపోతున్నారు.

**అరాచకం నుండి క్రమశిక్షణ వైపు: బహుముఖ వ్యూహం**

కేవలం ట్రాఫిక్ పోలీసులు మాత్రమే ప్రతీ ఒక్కరినీ పట్టుకుని శిక్షించాలనుకోవడం సాధ్యం కాని పని. మన రోడ్లను సురక్షితంగా మార్చాలంటే వ్యవస్థాగతమైన సంస్కరణలు అత్యవసరం. సంస్కరణల రంగాలు - ఆచరణాత్మక వ్యూహం - ఆశించిన ఫలితం

సాంకేతిక అమలు: ఆటోమేటెడ్ స్పీడ్ కెమెరాలు, ఏఐ ఆధారిత ట్రాఫిక్ సిగ్నల్స్, నేరుగా వాహన రిజిస్ట్రేషన్‌కు లింక్ అయ్యే డిజిటల్ చలాన్లు. రికమండేషన్లకు ఆస్కారం లేకుండా, ప్రతి ట్రాఫిక్ ఉల్లంఘనకు ఖచ్చితమైన జరిమానా పడేలా చేయడం.

**లైసెన్సింగ్ సంస్కరణలు**

కఠినమైన ప్రాక్టికల్ టెస్టులు, డిఫెన్సివ్ డ్రైవింగ్ (సురక్షిత డ్రైవింగ్) కోర్సులు ముగించిన తర్వాతే లైసెన్స్ ఇవ్వడం. లైసెన్స్ అనేది కేవలం వయస్సు ఆధారంగా కాకుండా, నైపుణ్యం, మానసిక పరిణతి ఆధారంగా లభిస్తుంది. కఠినమైన చట్టపరమైన చర్యలు- పదే పదే తప్పులు చేసే యువకుల లైసెన్సులను తక్షణమే రద్దు చేయడం, అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లోని అత్యవసర (ట్రామా) వార్డులలో వారికి తప్పనిసరి సామాజిక సేవను విధించడం. ప్రమాదాల తీవ్రతను కళ్లారా చూసి, వారి ఆలోచనా విధానంలో మార్పు రావడం.

**మారాల్సిన సామాజిక దృక్పథం**

చట్టాలు కేవలం కొంతవరకే నియంత్రించగలవు; అసలైన మార్పు సమాజంలో, కుటుంబాలలో రావాలి. తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు లేదా లైసెన్స్ లేని పిల్లలకు హోదా కోసమో, ప్రేమ కోసమో వాహనాల తాళాలు ఇవ్వడం ఆపాలి. విద్యాసంస్థలు కేవలం పుస్తకాల్లోని పాఠాలకే పరిమితం కాకుండా, రోడ్డు ప్రమాదాల వల్ల సర్వస్వం కోల్పోయిన కుటుంబాల నిజ జీవిత ఉదాహరణలను యువతకు వివరించి అవగాహన కల్పించాలి. యువత దేశానికి వెన్నెముక, మన భవిష్యత్తు. అలాంటి యువ శక్తి కేవలం కొన్ని నిమిషాల నిర్లక్ష్యం లేదా తొందరపాటు వల్ల రోడ్లపై రక్తం చిందిస్తూ అకాల మృత్యువాత పడటం అత్యంత విచారకరం. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం "హీరోయిజం" కాదని, అది మనల్ని ఒక "జీవచ్ఛవం" లేదా వార్తల్లో ఒక "గణాంకం (స్టాటిస్టిక్)" గా మిగులుస్తుందని యువత గ్రహించాల్సిన సమయం ఆసన్నమైంది.

# కన్నబాబుపై వ్యక్తిగత విమర్శలు తగవు : వైఎస్సార్సీపీ నాయకులు



**కరప, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభు త్వం రాష్ట్రంలో రెండేళ్లుగా అధికారంలో ఉన్న చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను చెప్పలేక జనసేన నాయకులు మాజీ మంత్రి, వైఎ స్సార్సీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ కోఆర్డినే టర్ కురసాల కన్నబాబుపై వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండల వైఎస్సార్సీపీ నాయకులు విమర్శించారు. వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మాజీ మంత్రి కన్నబాబు నాయకత్వంలో ఈ నెల 5న కరపలో నిర్వహించిన "బాబు వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమానికి మండలంలోని 23 గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేశారని తెలిపారు. కార్యక్రమానికి వచ్చిన ప్రజా స్పందనను చూసి తట్టుకోలేక జనసేన నాయకులు కన్నబాబుపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. కన్నబాబు హయాంలో కరప మండలంలోనే సుమారు రూ.1,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టారని వారు తెలిపారు. పంట కాలువల తవ్వకం, రహదారుల నిర్మాణం, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, కమ్యూనిటీ హాళ్లు, సీసీ రోడ్లు, పుంత రోడ్లు, బీటీ రోడ్లు, డ్రెయిన్లు, సామూహిక రక్షిత మంచినీటి పథకాల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. అదేవిధంగా సుమారు 6 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి సొంతింటి కలను సాకారం చేశారని, 45 దేవాలయాల నిర్మాణానికి కూడా సహకరించారని పేర్కొన్నారు. అభివృద్ధికి చిరునామాగా నిలిచిన నాయకుడు కన్నబాబు అని కొనియాడారు. జనసేన నాయకులు తమతో కలిసి వస్తే కన్నబాబు హయాంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా చూపిస్తామని, లేకపోతే సంబంధిత శాఖల అధికారులను సంప్రదించి రికార్డులు పరిశీలించినా వాస్తవాలు తెలుస్తాయని వైఎస్సార్సీపీ నాయకులు పేర్కొన్నారు.

# "నవచేతన" ద్వారా చిన్నారుల సమగ్రాభివృద్ధి

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ ఆదేశాల మేరకు నవచేతన ఏఐ ఆధారిత స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమం సామర్లకోట మండలంలో సోమవారం నిర్వహించారు. ప్రతి చిన్నారి సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "నవచేతన" కార్యక్రమంలో భాగంగా 0-6 సంవత్సరాల పిల్లల కోసం ఏఐ ఆధారిత ఎర్లీ చైల్డ్ హుడ్ డెవలప్మెంట్ స్క్రీనింగ్ నిర్వహణపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఉండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ శిక్షణలో సామర్ల కోట రూరల్ మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గన్నారు. నవచేతన యాప్ ద్వారా పిల్లల అభివృద్ధిని శాస్త్రీయ పద్ధతిలో అంచనా వేసి, అభి వృద్ధి ఆలస్యాలను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు అవసరమైన విధానాలపై సిడిపివో జి ఉష, డా. రోజాలు వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పిల్లల జీవి తంలో తొలి వెయ్యి రోజులు అత్యంత కీలకమైనవని, ఈ దశలో సరైన పోషణ, ఆరోగ్య సంరక్షణ, అభ్యసన అవకాశాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని తెలిపారు. నవచేతన కార్యక్రమం ద్వారా పిల్లలలో 4డి లను ముందస్తుగా గుర్తించి తగిన సేవలకు అనుసం ధానం చేయవచ్చని వివరించారు. అలాగే నవచేతన యాప్ ద్వారా పిల్లల స్థూల చలన నైపుణ్యాలు, సూక్ష్మ చలన నైపుణ్యాలు, భాషా అభివృద్ధి,



జ్ఞానాత్మక అభివృద్ధి, సామాజిక-భావోద్వేగ అభివృద్ధి వంటి అంశాలను అంచనా వేయవచ్చని తెలిపారు. స్క్రీనింగ్ ద్వారా గుర్తించిన పిల్లలను అవసరమైన సందర్భాల్లో వైద్య సేవలు, డైస్ సేవలకు అనుసంధానం చేయనున్నట్లు పేర్కొన్నారు. నవచేతన కార్యక్రమం కేవలం స్క్రీనింగ్ సాధనం మాత్రమేనని, ఇది నిర్ధారణ కాదని, తుది నిర్ధారణను వైద్య నిపుణులు నిర్వహిస్తారని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలను బాలల సమగ్రాభివృద్ధి కేంద్రాలుగా మరింత బలోపేతం చేయడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ శిక్షణలో జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, అంగన్వాడీ సూపర్ వైజర్‌లు ఉమాదేవి, నిర్మల కుమారి, నళిని, రూరల్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థిని చదువుకు జనసేన ఆర్థిక సహాయం


## - జనవాణి అర్జీకి స్పందన



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** జనసేన పార్టీ నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యలకు సత్వర పరిష్కారం అందించా లనే లక్ష్యంతో కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు. పెద్దాపురం నియోజకవర్గంలోని మాధవపట్నం గ్రామానికి చెందిన మాదారపు ప్రణిత ఒక నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని, తన చదువు కొనసాగించేందుకు ఆర్థిక సహాయం అందించాలని జనవాణి కార్యక్రమంలో అర్జీ సమర్పించింది. ఆ అర్జీపై స్పందించిన పార్టీ నాయకత్వం, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఆ కుటుంబానికి అవసరమైన సహాయాన్ని అందజేసింది. ఈ కార్యక్రమంలో మాధవపట్నం గ్రామ జనసేన నాయకులు పన్నీరు వెంకటేశ్వరరావు సహకారంతో ఆర్థిక సహాయం అందించగా, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి సహాయం అందజేశారు. ఈ సందర్భంగా తుమ్మల బాబు మాట్లాడుతూ జనవాణి కార్యక్రమం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటికి పరిష్కార మార్గాలు చూపించే వేదికగా నిలుస్తోందన్నారు. సమాజంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి కూడా విద్యకు దూరం కాకూడదనే సంకల్పంతో జనసేన పార్టీ పనిచేస్తోందన్నారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా ప్రజలకు అండగా నిలుస్తూ, అవసరమైన ప్రతి కుటుంబానికి సహాయ సహకారాలు అందించేందుకు జనసేన కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద కుటుంబానికి అండగా మాజీ ఎంపీ చింతా అనురాధ సహాయం

**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం వన్నెచింతలపూడి పంచాయతీ పరిధిలోని వీరయ్యపేటలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్లు దగ్ధమై నిరాశ్రయులైన కుటుంబానికి అల్లవరం మండలం మొగలమూరుకు చెందిన చింతా కృష్ణమూర్తి ఫౌండేషన్ సౌజన్యంతో ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ చింత అనురాధ సోమవారం సహాయాన్ని అందజేశారు. ప్రమాదంలో సర్వం కోల్పోయిన జనిపెల్ల సత్యనారాయణ కుటుంబానికి అనురాధ తన వంతు ఆర్థిక సహాయంతో పాటు, నిత్యవసర సరుకులు, వస్త్రాలు అందజేశారు. అగ్ని ప్రమాదంలో కట్టుబట్టలతో నిరాశ్రయులైన సత్యనారాయణ కుటుంబాన్ని ఓదార్చి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వన్నెచింతలపూడి వైయస్ఆర్సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు కలిదిండి బాబు, ఎంపీటీసీ పరమట నాగమణి, విష్ణు ప్రసాద్, జంపన రఘు రాజు, కుంచే శివ, కందిరి వెంకటేష్, పరమట బాబి,



కుంచే అర్జున్ రావు, చిల్లా రమణ, గోగు భార్గవ్, కందిరి నవీన్, కడిమి నవీన్, మోరంపూడి ప్రభుదేవా, పరమట ఉదయ్, పులపర్తి నాని, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలి

## - ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్




**గూడూరు, (రాజధాని వార్తలు):** అధికారంలోకి వచ్చేందుకు అబద్ధపు పథకాల పేరుతో హామీలిచ్చి మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని గూడూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి మురళీధర్ వైసీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. చంద్రబాబు మోసానికి రెండేళ్లు కార్యక్రమాన్ని గ్రామస్థాయిలోకి తీసుకువెళ్లే విధంగా పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అదేవిధంగా గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీ పథకాలు సంపూర్ణంగా అమలు కావడం లేదని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో మంజూరైన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేస్తూ పేద ప్రజలకు వైద్య సదుపాయాలు దూరం చేస్తున్నారని ఆయన విమర్శించారు. టిడిపి ఇచ్చిన హామీల్లో భాగంగా నిరుద్యోగ యువతకు హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈనెల 12వ తేదీన చంద్రబాబు మోసానికి రెండేళ్లు కార్యక్రమాన్ని ప్రజల పక్షాన వైసిపి నిరసన ర్యాలీ నిర్వహి స్తుందని ఈ ర్యాలీలో వైసీపీ శ్రేణులు అందరూ పాల్గొని ప్రజల నిరసనను ప్రభుత్వానికి తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గూడూరు మండల పార్టీ అధ్యక్షులు మల్లు విజయకుమార్ రెడ్డి, కోట మండల పార్టీ అధ్యక్షులు, వాటి పట్టణ మహిళా అధ్యక్షురాలు రేష్మ, నాయకుడు ఎల్లా శ్రీనివాసులు రెడ్డి, అన్నం మురళి గౌడ్, గూడూరు నియోజవర్గ పరిధిలోని పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# వీఆర్వో మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి



**రేణిగుంట, (రాజధాని వార్తలు):** అధికారుల పని ఒత్తిడి తట్టుకోలేక కర్నూలు జిల్లా వెంకయ్యపల్లి వీఆర్వో మహమ్మద్ హుస్సేన్ ఆత్మహత్యకు పాల్పడం చాలా బాధాకరం అని వీఆర్వో మరియు వీఆర్ఏలు తీవ్రంగా ఖండించారు. భవిష్యత్తులో ఏ ప్రభుత్వ ఉద్యోగి ఇలాంటి పరిస్థితి ఎదుర్కోకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి క్రింది స్థాయి ఉద్యోగులపై వేధింపులు సరికాదని, ఏ డిపార్ట్మెంట్ ఉద్యోగి ఆ డిపార్ట్మెంట్ పనులు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా అన్ని డిపార్ట్మెంట్ పనులు వీ ఆర్వోకి అప్పగిస్తున్నారని, ఇందువల్ల పని భారం ఎక్కువగా ఉన్నదని, ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితి కూడా పై అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని, రాష్ట్రంలో ఏ ఒక్క వీఆర్వో కూడా అధికారుల ఒత్తిడికి లొంగిపోయి మనస్థాపంతో తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని, సమస్యలు పరిష్కారానికి కలిసికట్టుగా పోరాడుదామని, మరణించిన వీఆర్వో మహమ్మద్ హుస్సేన్ మరణంపై సమగ్ర విచారణ చేసి బాధితులపై చర్య తీసుకుని వీఆర్వో కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండలం గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ సర్వేర్లు, గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ లైన్ తగిలి గురవమ్మ మృతి



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** ఏర్పేడు మండలంలోని మాధవ మాల దళితవాడకు చెందిన గురవమ్మ అనే మహిళ విద్యుత్ లైన్ తగిలి మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. ఏర్పేడు మండలంలోని మాధవ మాల గ్రామంలో ఓ రైతు తన నారుమడికి విద్యుత్తు లైన్లు బిగించి ఉన్నాడని స్థానికులు తెలిపారు. ప్రతిరోజు ఉదయం విద్యుత్తు లైన్లు తీసి వేయాల్సి వుంది. అయితే ఆ రైతు ఉదయం విద్యుత్ వైర్లు తీయకపోవడంతో అటువైపు వెళ్లిన ఆయన గ్రామంలోని దళితవాడకు చెందిన గురవమ్మ అనే మహిళ ఆ విద్యుత్ లైన్‌లు తగిలి అక్కడే మృతి చెందారు.


# రణ్‌వీర్‌పై యుద్ధం ప్రకటించడం సరైనదేనా? 'డాన్ 3' వివాదంపై సీనియర్ నటి!




బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ డాన్ 3 నుండి అర్ధాంతరంగా తప్పుకున్నారనే కారణంతో నిర్మాత ఫిర్యాదు మేరకు ఫెడరేషన్ అతడిపై నిషేధం (బ్యాన్) విధించిన సంగతి తెలిసిందే. దీనిపై పరిశ్రమలో తీవ్ర చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో.. సీనియర్ నటి .. సినీ & టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పూనమ్ థిల్లాన్ రణవీర్ సింగ్‌కు పూర్తి మద్దతుగా నిలిచారు. ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్ రణవీర్‌పై నాన్-కోఆపరేషన్ అంటూ జారీ చేసిన ఆదేశాలను తీవ్రంగా తప్పుబట్టారు. ఒక మూడవ పక్షం జోక్యం చేసుకుని ఇలా ఏకపక్షంగా యుద్ధం ప్రకటించినట్లు నిషేధం విధించడం విడ్డూరంగా ఉందన్న పూనమ్ ఈ సమస్యను పరిష్కరించుకోవడానికి రణవీర్ తమ అసోసియేషన్‌ను ఆశ్రయించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. ఫర్హాన్ బ్యానర్‌లో గతంలో గల్లీబోయ్ సహా మరో పెద్ద హిట్ చిత్రంలోను నటించిన అనుబంధం రణ్ వీర్‌కి ఉందని గుర్తు చేసారు.. అతడు ఎవరికీ కావాలని నష్టం చేసే వ్యక్తి కాదని... ఏదైనా బలమైన కారణం వల్లే డాన్ 3 నుండి తప్పుకుని ఉంటారని పేర్కొన్నారు. సినిమా నుండి తప్పుకున్నందుకు రణవీర్ అడ్వాన్స్ మొత్తాన్ని తిరిగి ఇవ్వడమే కాకుండా... దాదాపు 10 కోట్ల రూపాయల నష్టపరిహారాన్ని కూడా ఆఫర్ చేశారని... చాలామంది నటులు అసలు ఆ పని కూడా చేయరని రణవీర్‌ను అభినందించారు. అయితే సినిమా షూటింగ్ ప్రారంభానికి కేవలం మూడు వారాల ముందు అతడు తప్పుకోవడం వల్ల జరిగిన ప్రీ-ప్రొడక్షన్ నష్టానికి గాను ఎక్సెల్ సంస్థ 45 కోట్ల రూపాయలు డిమాండ్ చేయడంతో ఈ వివాదం మొదలైంది. నటీనటులు చివరి నిమిషంలో ప్రాజెక్టుల నుండి తప్పుకోవడం చిత్ర పరిశ్రమలో సర్వసాధారణమని పూనమ్ థిల్లాన్ స్పష్టం చేశారు. ఒకవేళ కథ (స్క్రిప్ట్) నచ్చకపోతే సినిమా నుండి తప్పుకునే పూర్తి హక్కు నటులకు ఉంటుందని పూనమ్ వాదించారు. ఎందుకంటే వెండితెరపై కనిపించేది వారేనని.. రేపు సినిమా సరిగ్గా ఆడకపోతే ప్రేక్షకుల నుండి వచ్చే విమర్శలను, నిందలను నటులే భరించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. రణవీర్ సింగ్ ఇప్పటికే పెద్ద స్టార్ కావడం వల్ల అతడికి లీగల్ సపోర్ట్ చూసుకునే ఆర్థిక సామర్థ్యం ఉందని.. అందుకే అతడికి సింటా జోక్యం అంతగా అవసరం పడలేదని అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో నటీనటులకు పూనమ్ ఒక కీలకమైన హితవు పలికారు. కేవలం స్నేహం కోసం.. మొహమాటానికి పోయి కథ పూర్తిగా వినకుండా ప్రాజెక్టులకు ఓకే చెప్పవద్దని సూచించారు. కేవలం ఎమోషనల్ అటాచ్‌మెంట్‌తో కమిట్ అయి.. ఆ తర్వాత ప్రాక్టికల్‌గా అది కంఫర్ట్ కాదని తెలిసినప్పుడు ఇలాంటి సమస్యలు వస్తాయన్నారు. సినిమా నుండి తప్పుకోవాలనుకుంటే ప్రారంభ దశలోనే ఆ నిర్ణయం తీసుకుని.. నిర్మాతలకు జరిగే నష్టాన్ని వీలైనంత తగ్గించాలని సూచించారు. కాగా రణవీర్ సింగ్ తరపున సిఐఎన్‌టిఏఏ ...ఐఎంపిపిఏ వంటి సంస్థలు రంగంలోకి దిగడం, అలాగే రణవీర్ లీగల్ నోటీసులు పంపడంతో ఫెడరేషన్ చివరకు దిగొచ్చి అతడిపై ఉన్న నిషేధాన్ని రద్దు చేసింది.

గత డిసెంబర్‌లో రణవీర్ సింగ్ నటించిన ధురంధర్ చిత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ విజయాన్ని అం దుకున్న కొన్ని రోజులకే ఆయన డాన్ 3 నుండి తప్పుకుం టున్నట్లు ప్రకటించారు. సినిమా బడ్జెట్‌ను.. అలాగే తన రెమ్యూనరేషన్‌ను సగానికి సగం తగ్గించడం... ఫైనల్ స్క్రిప్ట్‌పై పూర్తి సంతృప్తి లేకపోవడం.. దర్శకుడు ఫర్హాన్ అఖ్తర్‌తో క్రియేటివ్ డిఫరెన్సెస్ వల్లే రణవీర్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు పరిశ్రమ వర్గాల సమాచారం. ప్రస్తుతం ఈ వివాదం సద్దుమణిగినందుకు పూనమ్ థిల్లాన్ సంతోషం వ్యక్తం చేస్తూ... భవిష్యత్తులో ప్రొడ్యూసర్స్ గిల్డ్ సమక్షంలో ఈ సమస్యను పూర్తిగా.. సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని ఇరు వర్గాలను కోరారు.

# లవ్ ఎట్ ఫస్ట్ సైట్‌పై కంగన కామెంట్




బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ ముక్కుసూటి తత్వం గురించి తెలిసిందే. సమాజం.. సినిమా లేదా వ్యక్తిగత విషయాలు ఏదైనా సరే? అమ్మడు మనసులోని అభిప్రాయాలను నిర్మొహమాటంగా పంచుకుంటుంది. ఈ నేపథ్యంలోనే ప్రేమ .. పెళ్లి వంటి జీవిత భాగస్వామ్య బంధాలపై తాజాగా అమ్మడు చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాలలో పెద్ద చర్చకు దారితీశాయి. సినిమాల్లో చూపించే తొలిచూపు ప్రేమ అనే భావనపై కంగనా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. నిజ జీవితంలో అలాంటివి జరగవని, అదంతా కేవలం ఒక భ్రమ ..అర్థరహితమైన విషయమని కొట్టిపారేశారు. ఒకరి బాహ్య రూపాన్ని చూసి ప్రేమిస్తున్నామనుకోవడం సరికాదని.. నిజమైన అనుబంధం అనేది కాలక్రమేణా ఒకరినొకరు అర్థం చేసుకోవడం ద్వారా మాత్రమే బలపడుతుందని అభిప్రాయపడ్డారు. పెళ్లి .. జీవిత భాగస్వామిని ఎంచుకోవడం గురించి మాట్లాడారు. దీనిపై నేటి తరం యువతకు ఆమె ఓ విలువైన సలహా ఇచ్చారు. ఈ ప్రపంచంలో మనల్ని అర్థం చేసుకునే మనతో కలిసి నడిచే ఒక సరైన వ్యక్తి దొరకడం చాలా అరుదైన విషయమని పేర్కొన్నారు. ఒకవేళ అలాంటి వ్యక్తి మీ జీవితంలోకి వస్తే ఆ బంధాన్ని ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలని.. దానికి తగిన విలువ ఇవ్వాలని సూచించారు. సమకాలీన సమాజంలో బంధాలు చాలా త్వరగా ముక్కలైపోతున్న తరుణంలో పరస్పర గౌరవం.. సర్దుబాటు ధోరణి ఎంత ముఖ్యమో ఈ సందర్భంగా కంగనా గుర్తు చేశారు. ఏ బంధమైనా ఒక రోజులోనో ? ఒక చూపులోనే? శాశ్వతం కాదని ఇద్దరు వ్యక్తులు కలిసి ప్రయాణించే క్రమంలో చూపే ఓపిక, ఇచ్చే మద్దతుపైనే దాని మనుగడ ఆధారపడి ఉంటుందన్నారు. నైతిక విలువలు, నమ్మకం ఉన్నప్పుడే వైవాహిక జీవితం విజయవంతం అవుతుందన్నారు. సినీ ప్రపంచంలో లవ్ స్టోరీలను ఎంతో గ్లామరస్‌గా, అందంగా చూపిస్తారని కానీ వాస్తవ జీవితంలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటాయన్నారు. యువత కేవలం సినిమాల్లోని కాల్పనిక ప్రేమ కథలను చూసి భ్రమపడకుండా.. ప్రాక్టికల్‌గా ఆలోచించాలని కోరారు. భాగస్వాముల మధ్య ఉండే నిజాయితీ మాత్రమే సుదీర్ఘ ప్రయాణానికి పునాది వేస్తుందని తాను బలంగా నమ్ముతానన్నారు. నిత్యం వివాదాస్పద అంశాలతో వార్తల్లో ఉండే కంగనా ఈసారి సంబంధాల గురించి ఇంతటి పరిణతితో కూడిన ఆలోచనలను పంచుకోవడం అభిమానులను ఆశ్చర్యపరుస్తుంది. జీవితాన్ని, మనుషులను ఎంతో నిశితంగా పరిశీలించడం వల్లే కంగన ఇలాంటి వాస్తవిక దృక్పథాన్ని అలవర్చుకున్నారని తెలుస్తోంది.

# ఏలియన్ల కథతో స్టీవెన్ స్పీల్‌బర్గ్ సరికొత్త ప్రయోగం!



హాలీవుడ్ లెజెండరీ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ సైన్స్ ఫిక్షన్ – గ్రహాంతరవాసుల కథలను వెండితెరపై ఆవిష్కరించడంలో దిట్ట. ఈటీ, క్లోజ్ ఎన్‌కౌంటర్స్ ఆఫ్ ది థర్డ్ కైండ్, వార్ ఆఫ్ ది వరల్డ్స్ వంటి చిత్రాలతో ప్రపంచ ప్రేక్షకులను మైమరపించిన స్పీల్ బర్గ్ సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ అదే తరహా సరికొత్త చిత్రంతో రాబోతున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం డిస్‌క్లోజర్ డే జూన్ 12న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమాకు సంబంధించిన విశేషాలు ప్రపంచ సినిమా పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ చిత్రం కేవలం ఊహాజనిత గ్రహాంతరవాసుల దాడికి సంబంధించినది కాదని దీని వెనుక బలమైన హ్యూమన్ డ్రామా ..ప్రభుత్వ రహస్యాల కథాంశం ఉందని స్పీల్‌బర్గ్ రివీల్ చేసారు. భూమిపై ఏలియన్ల ఉనికికి సంబంధించిన నిజాలను ప్రపంచానికి తెలియజేయాలనుకునే ఒక యువ విజిల్‌బ్లోయర్ కథ చుట్టూ తిరుగుతుంది. భారీ ప్రభుత్వ కుట్రను ఛేదించి, మానవ చరిత్రను శాశ్వతంగా మార్చేసే ఆ పరమ సత్యాన్ని ప్రపంచానికి డిస్‌క్లోజ్ చేయడమే ఈ చిత్రంలోని ప్రధానాంశం. స్పీల్‌బర్గ్ ఈ చిత్రకథను తానే స్వయంగా సిద్ధం చేసుకోగా.. ఆయనతో పాటు జురాసిక్ పార్క్ ఫేమ్ డేవిడ్ కోయెప్ స్క్రీన్‌ప్లే అందించారు. ఈ చిత్రంలో హాలీవుడ్ స్టార్స్ ఎమిలీ బ్లంట్, జోష్ ఓ కానర్, కోలిన్ ఫిర్త్, కోల్మన్ డొమింగో, ఈవ్ హెవ్సన్ కీలక పాత్రల్లో నటించారు. ఎమిలీ బ్లంట్ ఈ సినిమాలో వాతావరణ శాస్త్రవేత్తగా నటిస్తుండగా, ఆమె అనుకోకుండా ఒక గ్రహాంతర భాషలో మాట్లాడటం ప్రారంభించే సీన్ సినిమా ట్రైలర్‌లోనే ప్రేక్షకులను ఎంతగానో థ్రిల్ చేసింది. జోష్ ఓ కానర్ రహస్యాలను దొంగిలించే ప్రభుత్వ ఉద్యోగి పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా నిర్మాణంలో స్పీల్‌బర్గ్ ఓ ఆసక్తికరమైన నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో విజువల్ ఎఫెక్ట్స్ ..డబ్బింగ్ కోసం ఏఐ సాంకేతికతను విరివిగా వాడుతున్నప్పటికీ ఆయన మాత్రం సాంప్రదాయ పద్ధతులకే మొగ్గు చూపారు. సినిమాలో ఎమిలీ బ్లంట్ మాట్లాడే వింత గ్రహాంతర భాషను సహజంగానే రికార్డ్ చేశారు. ఒకవేళ అది కుదరకపోయినా తానేమీ ఏఐ వైపు వెళ్లేవాడిని కాదని, జంతువుల శబ్దాలను స్లో లేదా రివర్స్ చేసి ఓల్డ్-ఫ్యాషన్ పద్ధతిలోనే ఆ వింత శబ్దాలను సృష్టించేవాడినని స్పీల్‌బర్గ్ వెల్లడించారు. ఈ చిత్రానికి స్పీల్‌బర్గ్ రెగ్యులర్ కొల్లాబరేటర్స్ అయిన జానూస్ కామిన్స్కి సినిమాటోగ్రఫీ అందించగా.. దిగ్గజ సంగీత దర్శకుడు జాన్ విలియమ్స్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సమకూర్చారు. ఈసారి జాన్ విలియమ్స్ సంగీతం సినిమాను నడిపించేలా కాకుండా.. కథలోని సన్నివేశాల తీవ్రతను ప్రేక్షకుడికి సున్నితంగా తాకేలా సరికొత్త శైలిలో ఉంటుందని దర్శకుడు పేర్కొన్నారు.

# AA23 కోసం లోకేష్ ఏం ప్లాన్ చేస్తున్నాడు?




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కబోతున్న AA23 ప్రాజెక్ట్‌పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. అధికారికంగా షూటింగ్ ప్రారంభం కాకముందే ఈ సినిమా చుట్టూ వినిపిస్తున్న అప్డేట్లు చూస్తుంటే, మేకర్స్ ఎంత పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తున్నారో అర్థమవుతోంది. ముఖ్యంగా అల్లు అర్జున్ ప్రస్తుతం రాకా షూటింగ్‌తో బిజీగా ఉన్నప్పటికీ, AA23 కోసం బ్యాక్‌ఎండ్ వర్క్ ఇప్పటికే వేగంగా సాగుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్ మే 25, 26 తేదీల్లో ప్రత్యేకంగా సమావేశమైనట్టు తెలుస్తోంది. ఆ తర్వాత జూన్ తొలి వారంలో మరోసారి ఇద్దరూ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ వరుస సమావేశాలు కేవలం స్టోరీ డిస్కషన్స్ కోసమే కాకుండా, సినిమా టోన్, పాత్ర రూపకల్పన, నిర్మాణ స్థాయి వంటి అంశాలపై కూడా జరిగి ఉండొచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు లియో సినిమాకు కో రైటర్‌గా వర్క్ చేసిన రత్నకుమార్ ప్రస్తుతం స్క్రిప్ట్ ఫైనల్ డ్రాఫ్ట్‌పై దృష్టి పెట్టినట్లు సమాచారం. అంటే కథా నిర్మాణం కూడా చివరి దశకు చేరుకుంటోందని అర్థమవుతోంది. ఇక ప్రీ- ప్రొడక్షన్ వర్క్స్ కూడా సమాంతరంగా కొనసాగుతున్నాయి. చిత్ర యూనిట్‌లోని ఒక విభాగం ఇప్పటికే లొకేషన్ రెక్కీ పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఢిల్లీ నగరం ఈ కథలో కీలకమైన భాగంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. లోకేష్ కనగరాజ్ గత సినిమాలను పరిశీలిస్తే, కథకు బలమైన నేపథ్యం ఇచ్చే ప్రదేశాలను ఎంపిక చేయడంలో ఆయనకు ప్రత్యేక శైలి ఉంది. అందుకే ఢిల్లీ సెలెక్షన్ వెనుక కూడా కథలో కీలక మలుపులు లేదా భారీ యాక్షన్ ఎపిసోడ్లు ఉండవచ్చనే అంచనాలు వినిపిస్తున్నాయి. అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, రాకా ప్రాజెక్ట్ పూర్తైన వెంటనే అల్లు అర్జున్ తన పూర్తి దృష్టినిAA23పై కేంద్రీకరించనున్నట్లు సమాచారం. అంటే షూటింగ్ ప్రారంభానికి ముందే స్క్రిప్ట్, లొకేషన్స్, టెక్నికల్ ప్లానింగ్ వంటి అంశాలను పూర్తిగా రెడీ చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలున్న ఈ ప్రాజెక్ట్‌ను ఎలాంటి హడావుడి లేకుండా, ప్రతి దశను జాగ్రత్తగా ప్లాన్ చేస్తూ ముందుకు తీసుకెళ్తున్నారనే సంకేతాలు కనిపిస్తున్నాయి. పుష్ప ఫ్రాంచైజీతో దేశవ్యాప్తంగా తన మార్కెట్‌ను విస్తరించుకున్న అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్ వంటి మాస్ యాక్షన్ కథలను కొత్త స్థాయికి తీసుకెళ్లగల డైరెక్టర్‌తో జతకట్టడం వల్ల AA23పై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. ఇప్పుడు బయటకు వస్తున్న ఈ ప్రీ ప్రొడక్షన్ అప్డేట్లు చూస్తుంటే, ఈ సినిమా కేవలం మరో కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా కాకుండా, అత్యంత ప్రణాళికాబద్ధంగా రూపొందుతున్న మెగా పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# అర్జీల పరిష్కారంలో జిల్లా అధికారులు బాధ్యత వహించాలి

## - జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమలో వచ్చిన అర్జీలను పరిష్కరించ డంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు భాధ్యత వహిం చాలని జిల్లా కలెక్టరు ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మంది రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమంలో ప్రజలు అందజేసిన అర్జీలు పరిష్కారంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. కింది స్థాయి సిబ్బంది సకాలంలో పరిష్కారం చూపేలా పర్యవేక్షణ చేయాలని, అర్జీదారునితో నేరుగా మాట్లాడి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. మునిసిపాలిటీ, గ్రామీణ నీటిసరఫరా, పెన్షన్లు పంపిణీ తదితర పథకాలకు సం బంధించి ప్రజా సానుకూలత శాతం తగ్గడంపై అసంతృప్తి వ్యక్తం చేసారు. ఆయా కార్యక్రమాలు సక్రమంగా అమలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని, ప్రజా సానుకూలత 90 శాతం సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జాయింటు కలెక్టరు సేధు మాధవన్, జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్. సత్తిబాబు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# ఏనుగుల బారి నుంచి పార్వతీపురం మన్యం జిల్లాను కాపాడండి



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** పార్వతీపురం నియోజకవర్గంలో సోమవారం జరిగిన జిపిఆర్ఎస్‌లో గిరిజన, శిశు సంక్షేమ శాఖ మాత్యులు గుమ్మడి సంధ్యారాణికి పార్వతీపురం అటవీ ప్రాంత రైతుల కష్టాలు తెలియజేసిన పార్వతీపురం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బత్తిన మోహన్, పార్వతీపురం మన్యం జిల్లాలో ఏనుగులు సుమారు పాతికేళ్లుగా సంచరిస్తున్నాయని పట్టించుకునే అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గాని లేరని జిపిఆర్ఎస్‌లో మంత్రికి మన్యం కష్టాలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకుల మన్యం జిల్లా మొత్తం చుట్టుముట్టిన ఏనుగులను అదుపులోనికి తీసుకోవాలని ఏనుగుల దాడితో మరణించిన వ్యక్తులకు ఎక్స్గ్రేషియా మంజూరు చేయాలని ఏనుగుల బాధితుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మన్యం జిల్లా కలెక్టరేట్లో మంత్రికి నివేదించిన నాయకులు తక్షణమే స్పందించిన మంత్రి పార్వతీపురం మన్యం జిల్లాలో ఏనుగులను నియంత్రణ చేయలేక పోతున్న ఫారెస్ట్ అధికారులను మందలించి తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఏనుగుల సంచారముతో గిరిజన మరియు ఇతర రైతులు ఎంతగానో నష్ట పోయారని ఏనుగుల సమస్యతో పరిష్కారం తక్షణమే చూపించా లని కోరారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి మరియు ఇతర అధికారులతో మాట్లాడి రక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సోమవారం చేపట్టిన జిపిఆర్ఎస్ గ్రీవెన్స్ కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా కాంగ్రెస్ పార్టీ తాత్కాలిక డిసిసి చొక్కాపు వెంకటరమణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు, మన్యం జిల్లా సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయ కులు పాలక రంజిత్ కుమార్, జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ జాగాన భాస్కరరావు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు మామిడి చంద్రకుమార్ మాజీ ఎంపీటీసీ సభ్యులు సత్యం నాయుడు, పలువురు గిరిజన సంఘ నాయకులు తదితరులు పాల్గొని సమస్యను నివేదించారు.

# నిర్దిష్ట గడువులోపు ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించిన జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, ఐపిఎస్

## - పార్వతీపురం మన్యం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం నిర్వహించిన జిల్లా ఎస్పీ



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** పార్వతీపురం మన్యం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, వాటికి వేగవంతమైన పరిష్కారం అందించే లక్ష్యంతో, జూన్ 8న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్ర మాన్ని జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, ఐపిఎస్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి, వారితో ముఖా ముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదు లను క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా నడవలేని పరిస్థితుల్లో ఉన్నటువంటి వృద్ధులు, వికలాంగులు వద్దకు జిల్లా ఎస్పీ స్వయం గా వెళ్లి వారి యొక్క ఫిర్యాదులోని అంశాలను గురించి అడిగి తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వేగవంతంగా సమస్య లను పరిష్కరించడానికి తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపవలెనని అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు వేధింపులు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ-ఆస్థి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలు తదితర అంశాలపై మొత్తంగా 12 ఫిర్యాదులు అందాయి. ప్రజలు ఎలాంటి భయం లేకుండా తమ సమస్యలను పోలీస్ శాఖ దృష్టికి తీసుకు రావాలని, ప్రజల భద్రత మరియు శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటుగా ఎస్బీ సిఐ బి.రమణమూర్తి, డిసియార్బీ ఎస్సై అశోక్ చక్రవర్తి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# వైసిపి నుండి టిడిపిలోకి భారీగా చేరికలు

## - అభివృద్ధి పథకాలు చూసే పార్టీలో చేరాం - వైసిపి అరాచక పాలనకు ఈ చేరికలే నిదర్శనం : పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** సీతానగరం మండలం, గుచ్చిమి గ్రామానికి చెందిన పలువురు వైసిపి నాయకులు, కార్య కర్తలు టిడిపిలో చేరారు. సోమవారం నర్సిపురం భాను కన్వెన్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర చేతుల మీదుగా గుచ్చిమి గ్రామానికి చెందిన బూరాడ చిరంజీవి ఆధ్వర్యంలో దాదాపు 100 కుటుంబాలు పసుపుకండువ కప్పుకొని టిడిపిలో చేరి వైసీపీని వీడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ భవిష్యత్తులో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వం వల్లే సాధ్యమని అన్నారు. గతంలో ఏ ప్రభు త్వము అందించలేని సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం అందిస్తుందని, మన రాష్ట్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంపై నమ్మకం ఉంచి భారీ ఎత్తున ప్రజలు టిడిపిలోకి చేరేందుకు సంసిద్ధులవుతున్నారని, రాబోయే స్థానిక ఎన్నికల్లో శత శాతం ఫలితాలు లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయా లని, పార్టీలో చేరిన వారందరికీ సముచిత గౌరవం కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీతానగరం మండ లానికి చెందిన పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలో నర్సిపురం కవి దక్కిన గౌరవం



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** రాజమహేంద్రవరం గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో ఈ నెల 6, 7 తేదీల్లో చైతన్య సారస్వత పరిషత్ మరియు శ్రీశ్రీ కళా వేదిక సంయుక్త ఆద్వర్యంలో ఏడవ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలులో పార్వతీపురం మన్యం జిల్లా నర్సిపురం గ్రామానికి చెందిన కవి, రచయిత గంటా రామ కృష్ణకి ఘన సత్కారం జరిగింది. మేలుకో ఓ కవిత్వమా అంటూ కవిత్వం అంటే కేవలం అక్షరాలు కూర్పు కాదు..ఆది ప్రశ్నించే గుండె చప్పుడు...అది అన్యాయాన్ని చీల్చే నిశితాస్త్రం అంటూ.. పదునైన పదప్రయోగాలతో కవిత సమ్మేళనంలో...కవిత గానం చేసేటప్పుడు.. పదండి త్రోసుకు..పదండి ముందుకు అంటూ ఒక్కసారి గంభీరంగా అన్నప్పుడు.హాలంతా ఒక్కసారి కరతాళ ధ్వనులతో చప్పట్లుతో మారుమోగిపోయింది. అక్కడున్న ఆంధ్ర రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ ఉద్యోగుల సంఘం ఛైర్మన్ కేతా శ్రీనివాస్ ప్రత్యేక అభినందలు తెలియజేశారు. తెలుగు భాష వైభవాన్ని, గొప్పతనాన్ని బాగా వివరించిన కవి గంట రామకృష్ణని ప్రశంసలతో పాటు దుశ్శాలువతో జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రంతో పాటు ఘన సత్కారం కళావేదిక నిర్వాహకులు చేతుల మీదుగా జరిగింది. గ్లోబల్ యూనివర్సిటీ అధినేత కెవివి చైతన్యరాజు శ్రీశ్రీ వేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ కుమార్ జాతీయ అధ్యక్షులు ఈశ్వరీ భూషణం జాతీయ ప్రణాళిక అధికారి డాక్టర్ టి.పార్థసారథి, ఏపీ జేఏసి చైర్మన్ కేతా శ్రీవాసరావు పాల్గొన్నారు.

# డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధ్వర్యంలో జిల్లాస్థాయి సమావేశం



**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం మరియు పార్వతీపురం జిల్లాల ఎక్సైజ్ అధికారులు జిల్లాస్థాయి సమావేశం, స్థానిక బ్యాంక్ కాలనీలో గల డిప్యూటీ కమిషనర్ వారి కార్యా లయంలో 08.06.2026 సోమవారం నాడు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో విజయనగరం జిల్లా అసిస్టెంట్ కమీషనర్ అఫ్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ పి.రామచంద్ర రావు విజయనగరం జిల్లా డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ ఆఫీసర్ బమ్మిడి శ్రీనాథుడు, విజయనగరం మరియు పార్వతిపురం మన్యం అసిస్టెంట్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు హాజరయ్యారు.

మీటింగ్‌లో కీలక అంశాలు :

1.ఎమ్మార్పీ ధరలు పాటించాలి. 2.అనధికార మద్య దుకాణాలు ఉండరాదు. 3.గ్రామాల్లో బెల్ట్ షాపుల కోసం వేలం పాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోబడతాయి. 4. నాటు సారాయీ తయారీ అమ్మకాలు మరియు రవాణాపై ప్రత్యేక నిఘా. 5. ఇతర రాష్ట్రాల నుండి సారా రాకుండా అడ్డుకట్ట వేయాలి. 6. రెస్టారెంట్ & బార్స్ మరియు మద్యం షాపులు అన్నీ లైసెన్స్ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. 7. ఎక్సైజ్ రెవెన్యూ పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు అని స్థానిక విజయ నగరం - వన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ మన్మధ రావు ప్రకటనలో తెలిపారు.

# జీవితంలో క్రీడలు ఒక భాగం కావాలి

## - ఘనంగా ముగిసిన సమ్మర్ కోచింగ్ క్యాంప్



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** విద్యార్ధి జీవితంలో క్రీడలు ఒక భాగం కావాలని తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగ నాగ్, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహణా కార్యదర్శి రాజా సూరిబాబు రాజులు అన్నారు. పెద్దాపురం మహారాణి కళాశాల గ్రౌండ్స్‌లో మే ఒకటో తేదీ నుండి 31 తేదీ వరకు కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాస్కెట్ బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా తెదేపా జిల్లా ఉపాధ్య క్షులు నిమ్మకాయల రంగనాగ్, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి రాజసుబ్బరాజు పాల్గొని మాట్లాడుతూ బాల్యం నుండి పిల్లలను క్రీడలకు తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుంద న్నారు. అదేవి ధంగా ఈ సమ్మర్‌లో నెలరోజులు పాటు కోచింగ్‌కు పంపించిన తల్లిదండ్రులకు సూరిబాబు రాజు అభినందనలు తెలిపారు. అలాగే రంగనాగ్ మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్ పెట్టడం వల్ల పిల్లలు ఎంతో ఆరోగ్యంగా ఉంటారని, అలాగే మానసికంగా ఉ త్తేజ పరచబడి చదువులో కూడా రాణిస్తారన్నారు. ఇటువంటి క్యాంపులు పెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం వందమంది పిల్లలకు జెర్సీ కిట్లను వారి చేతుల మీదుగా అంద జేశారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం, కోచ్‌లు శేషగిరిరావు, రఘుకుమార్ వెంకటరావు అనీల్, అలాగే మహారాణి కళాశాల ప్రిన్సిపాల్, రామ తులసి ఫైనాన్స్ అధినేత మునిరెడ్డి శ్రీరాములు, తూతిక రాజు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆరోగ్య, జీవన శైలికి సైకిల్ ప్రయాణం దోహదం



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** శారీరక దృఢత్వానికి, ఆరోగ్యకర జీవనశైలికి, పర్యావరణ పరిరక్షణకు సైకిల్ ప్రయాణం ఉపయో గకరమని పెద్దాపురం డిఎస్పి ఏబిజీ తిలక్ అన్నారు. ఆదివారం ప్రపంచ సైకిల్ దినోత్సవం మరియు క్విట్ ఇండియా మూమెంట్లో భాగంగా కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు పెద్దాపురం డిఎస్పి తిలక్ ఆధ్వర్యంలో పెద్దాపురం నుండి సామర్ల కోట వరకు సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఫిట్‌నెస్‌కు సైకిల్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు కృష్ణ భగవాన్, వైఆర్కే శ్రీనివాస్, అంకబాబు, ఎస్సైలు వి మౌనిక, మూర్తి, రాజా, గరగారావు, సీసీ కృష్ణ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ఫామ్ గ్రీన్ వాల్ ప్రాజెక్టును అమలు చేయాలి : బిజెపి నేత ముక్కు రాధాకృష్ణ గౌడ్ వినతి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జనతా వారధిలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగిందని, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ముక్కు రాధాకృష్ణ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా గ్రీవెన్స్ డేలో ఆయన మాట్లాడుతూ గీత కులాల గౌరవం, పర్యావరణ పరిరక్షణ స్వావలంబన కోసం తరతరాలుగా ప్రకృతితో మమేకమై జీవిస్తూ, తాటి చెట్టును ఆధారంగా చేసుకొని కుటుంబాలను పోషించుకుంటున్న గౌడ, శెట్టిబలిజ, శ్రీశైన, ఈడిగ, యాత తదితర గీత కులాల ఆకాంక్షలను మీ ముందుకు వినమ్రంగా తీసుకు వస్తున్నామన్నారు. భారతీయ జనతా పార్టీ నిర్వహిస్తున్న "జనతా వారధి" కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా గీత కులాల స్థితిగతులను అధ్యయనం చేయడం జరిగింది. అలాగే గీత కులాల సంఘాలు, సొసైటీలు, పెద్దలు, మేధావులు మరియు వృత్తిదారులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వచ్చిన సూచనలు, అభిప్రాయాలు మరియు ఆకాంక్షల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వస్తున్నామని, భారతదేశ సనాతన జీవన విధానంలో తాటి చెట్టు ఒక సాధారణ వృక్షం కాదు, అది గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక, పర్యావరణ పరిరక్షణకు సహజ రక్షకుడు, వేలాది కుటుంబాల జీవనాధారం, తాటి చెట్టు మన సంస్కృతికి, మన గ్రామీణ జీవన విధానానికి ప్రతీక అన్నారు. అయితే నేడు గీత వృత్తి అనేక సవాళ్లను ఎదుర్కొంటూ తన ఉనికిని కాపాడుకునే పరిస్థితికి చేరుకుంది. తాటి చెట్ల సంఖ్య క్రమంగా తగ్గిపోవడం, వృత్తికి తగిన ప్రోత్సాహం లేకపోవడం, యువత ఈ వృత్తికి దూరమవడం, ఎక్సైజ్ చట్టాల కారణంగా ఏర్పడుతున్న ఇబ్బందులు, గీత వృత్తిదారుల పట్ల సమాజంలో ఉన్న అపోహలు వారి కుటుంబాల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. ముఖ్యంగా మద్యం దుకాణాల రిజర్వేషన్ విధానంలో అసలు లబ్ధిదారులకు ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందకపోవడం, రాజకీయంగా బలమైన వర్గాలు అవకాశాలను వినియోగించుకోవడం వల్ల గీత వృత్తిదారులు నష్టపోతున్నారు. గీత వర్గాల పేరుతో కల్పించిన అవకాశాలు కూడా చాలాసార్లు వారికి అందని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గీత కులాల సంఘాలు, సొసైటీలు, పెద్దలు, మేధావులు సమాజంపై బాధ్యతతో అనేక విలువైన సూచనలు చేశారు. వాటిని పరిగణనలోకి తీసుకుని క్రింది అంశాలపై తక్షణ చర్యలు చేపట్టవలసిందిగా కోరుతున్నాము. తాడి చెట్లకు సంబంధించిన ఎక్సైజ్ చట్టాలను పునఃసమీక్షించి, తాటి చెట్టు సంరక్షణ మరియు గీత వృత్తిదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన సంస్కరణలు చేపట్టాలి. గీత వృత్తిని గౌరవప్రదమైన సంప్రదాయ వృత్తిగా గుర్తించి ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలి అని అన్నారు. నీరా పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసి, నీరా ఆధారిత ఉత్పత్తులకు మార్కెట్, బ్రాండింగ్ మరియు ప్రోత్సాహం కల్పించాలి. రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్థాయిలో తాటి మొక్కల పెంపక కార్యక్రమాన్ని ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టాలి. ఆంధ్రప్రదేశ్ సముద్రతీర ప్రాంతాలలో "పామ్ గ్రీన్ వాల్ ప్రాజెక్ట్" అమలు చేసి పర్యావరణ పరిరక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలి. సముద్ర తీర ప్రాంత పరిశ్రమలు, కర్మాగారాలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలి. తాటి ఆధారిత బయోడీజిల్, హార్టికల్చర్, ఆయుష్, ఫుడ్ ప్రాసెసింగ్, హస్తకళలు మరియు ఇతర విలువ ఆధారిత ఉత్పత్తులపై పరిశోధన, పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక ప్రోత్సాహం అందించాలి. నీరా కాంపౌండ్లు, సంప్రదాయ కల్లు విక్రయ కేంద్రాలను ఆధునికీకరించి పరిశుభ్రమైన, గౌరవప్రదమైన మరియు వృత్తిపరమైన నిర్వహణకు అవకాశాలు కల్పించాలి. గీత వృత్తిదారుల పిల్లలకు విద్య, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి మరియు ఉద్యోగ అవకాశాలలో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలి. గీత వృత్తి కేవలం ఉపాధి మార్గం మాత్రమే కాదు; అది మన సంస్కృతి, మన ఆత్మగౌరవం, మన అస్తిత్వమనే విషయాన్ని సమాజానికి తెలియజేసే కార్యక్రమాలు చేపట్టాలి. గీత కులాల ఆదిపురుషుడిగా భావించే కౌండిన్య మహర్షి జయంతిని అధికారికంగా నిర్వహించి రాష్ట్రస్థాయి గుర్తింపు ఇవ్వాలి. తాటి చెట్టును కాపాడటం అంటే ప్రకృతిని కాపాడటం, గీత కులాలను ఆదుకోవడం అంటే గ్రామీణ భారత ఆత్మను బలోపేతం చేయడం. తాటి చెట్టు నీడలో పెరిగిన తరాలు, భవిష్యత్ తరాలకు కూడా అదే గౌరవం, అదే జీవనాధారం అందాలని మేము కోరుకుంటున్నాము. ఈ సంకల్పంతోనే భారతీయ జనతా పార్టీ "సంకల్పం" పేరుతో రాష్ట్రవ్యాప్తంగా తక్కువ సమయంలో పెరిగే తాటి మరియు పామ్ జాతి మొక్కల నాటే కార్యక్రమాన్ని ప్రారంభించింది దీనికి అధికారులు సహకరించాలి. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి గీత వృత్తిదారుల కుటుంబాలను సందర్శించి వారి జీవన పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు.

గీత కులాల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరిస్తుందనే ఆశాభావం సమాజంలో ఉంది. అందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టాలని వినమ్రంగా కోరుతున్నాము. గీత కులాల అభ్యున్నతి, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ స్వావలంబన మరియు సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు దోహదపడే నిర్ణయాలు తీసుకోవాలని ఆయన అన్నారు. పై కార్యక్రమంలో బిజెపి కిషన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తరకాల మోహన్ బాబు గౌడ్ భాస్కర్ గౌడ్ దద్దోలు పవన్ తేజ గౌడ్ పంది మస్తానయ్య గౌడ్ దాసరి ప్రసాద్ గౌడ్ కరణం సుభాషిని బెల్లంకొండ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

# యల్లాయపాళెం రామాపురంలో విపిఆర్ నేత్ర సేవలు ఎనలేనివి

## - టీడీపీ నేత బూలోకం విజయ్ కుమార్



**కొడవలూరు, (రాజధాని వార్తలు):** కంటి చూపులను ప్రసాదిస్తున్న విపిఆర్ పుణ్యదంపతులు సేవలు ఎనలేనిదని టీడీపీ సీనియర్ నేత పార్లమెంట్ ఆర్గనైజర్ బూలోకం విజయ కుమార్ అన్నారు. సోమవారం కొడవలూరు మండలంలోని యల్లాయపాళెం పంచాయతీ రామాపురం గ్రామంలో విపిఆర్ నేత్ర శిబిరం జరిగింది. ప్రజలకు మెరుగైన కంటి ఆరోగ్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మరియు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి మ్మ ఆదేశాలతో రామాపురంనందు విపిఆర్ నేత్ర సేవల అందించడం జరిగింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు సులభంగా అందుబాటులో కంటి పరీక్షలు మరియు అవసరమైన వైద్య సలహాలు అందించేందుకు ఈ కార్యక్రమం ప్రారంభించడం ఎంతో అభినందనీయమని చెప్పారు. యల్లాయపాళెం పంచాయతీ రామాపురం గ్రామం ప్రజలకు మెరుగైన కంటి ఆరోగ్య సేవలన నందు విపిఆర్ నేత్ర సేవలు విజయవంతం అయిందని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సులభంగా అందుబాటులో కంటి పరీక్షలు మరియు అవసరమైన వైద్య సలహాలు అందించేందుకు ఈ కార్యక్రమం ప్రారంభించడం ఎంతో అభినందనీయంగా ఉందని చెప్పారు. అందరు కలిసి ప్రారంభించడంతో ఎంతో సంతృప్తిగా ఉందని పలువురు అన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, గ్రామంలో చాలామంది చిన్నపాటి కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల భవిష్యత్తులో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా వయస్సు పెరిగే కొద్దీ చూపు మందగించడం, కంటి మసక, కంటి నొప్పి, దూరం లేదా దగ్గరగా చూడడంలో ఇబ్బందులు, అలాగే ఇతర కంటి సంబంధిత సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స పొందేందుకు విపిఆర్ నేత్ర సేవలు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని చెప్పారు. గ్రామ ప్రజలకు నాణ్యమైన నేత్ర పరీక్షలు, వైద్యుల సలహాలు, అవసరమైన మార్గదర్శకత్వం అందించడం ద్వారా ప్రజల్లో కంటి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కేతు వెంకటరమణారెడ్డి, భూలోకం విజయ్ కుమార్, గరికపాటి రాజా, కే.శేఖర్ రెడ్డి, సయ్యద్ అన్సర్, నాగభూషణం, రసూల్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియపై అవగాహన తప్పనిసరి

## - టీడీపీ ఇంచార్జి జెట్టి మదన్మోహన్ రెడ్డి





**కోవూరు, (రాజధాని వార్తలు):** ఓటర్ల జాబితాలో ప్రతి కార్యకర్త క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా ఉండే విధంగా కృషి చెయ్యాలని పడుగుపాడు టీడీపీ ఇంచార్జి జెట్టి మదన్ మోహన్ రెడ్డి అన్నారు. పడుగుపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం నందు గంటలకు, కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశానుసారం స్థానిక నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడిందని చెప్పారు. ఈ సందర్భంగా పడుగుపాడు ఇంచార్జ్ జెట్టి మదన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, ప్రతి నాయకుడు మరియు కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేసి అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో నమోదు చేయించేలా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కన్వీనర్లు, కో-కన్వీనర్లు, క్లస్టర్ మరియు యూనిట్ ఇంచార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఓటర్ల డ్రాఫ్ట్ జాబితా పరిశీలన, అభ్యంతరాల నమోదు ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ తదితర అంశాలపై సుదీర్ఘంగా అవగాహన కల్పించారు. ప్రతి కార్యకర్త ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా పునాది కావడంతో, ఈ ప్రక్రియను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ కూటమి నేతలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమలులో నిర్దేశిత లక్ష్యాలు తప్పనిసరిగా సాధించాలి

## - అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్







**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలు, ఉపాధి హామీ పథకం పనులు, అక్షర ఆంధ్ర కార్యక్రమం, గృహ నిర్మాణం, పీఎం సూర్య ఘర్ యోజన, ఈ-కేవైసీ, మన మిత్ర, క్రాప్ బుకింగ్, ఓడీఎఫ్ గ్రామాలు, డీఆర్డీఏ ద్వారా, స్వచ్ఛాంధ్ర తదితర అంశాల పురోగతిని పై కలెక్టర్ సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, ప్రతి కార్యక్రమం గ్రామ స్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉపాధి హామీ పనులను వేగవంతం చేయడంతో పాటు గృహ నిర్మాణాలు, పీఎం సూర్య ఘర్ యోజనలో నిర్దేశిత లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ-కేవైసీ, క్రాప్ బుకింగ్ ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ ఓడీఎఫ్ హోదాను కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# వేమిరెడ్డి దంపతలను మర్యాద పూర్వకంగా కలిసిన చాకిచర్ల పెద్దపాలెం కాపులు, నాయకులు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులను మర్యాద పూర్వకంగా చాకిచర్ల పెద్దపట్టపుపాలెం గ్రామ కాపులు మరియు గ్రామ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని కలిసి బీచ్‌కి వెళ్లే బ్రిడ్జ్ గురించి మాట్లాడటం జరిగింది. అందుకు ఆయన స్పందించి వెంటనే తన స్వంత నిధులతో (సుమారుగా 50 లక్షల పైబడి) ఏర్పాటు చేపిస్తానని గ్రామ కాపులకు మాట ఇవ్వడం జరిగింది. ఆదే విధంగా 450 మీటర్లు సిమెంట్ రోడ్డు కూడా వేయిస్తానని చెప్పడం జరిగింది. ఇందుకు గ్రామ కాపులు వేమిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకారుల గ్రామాభివృద్ధికి



వేమిరెడ్డి చర్యలు తీసుకొన్నందుకు గ్రామం తరపున ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలను కాపులు, పెద్దలు, నాయకులు తెలిపారు.

# వీర మహిళ మద్దెల బుజ్జమ్మ మృతికి దండి రాఘవయ్య సంతాపం



**శ్రీకాళహస్తి టౌన్, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని ఎర్రగుడిపాడు గ్రామానికి చెందిన జనసేన పార్టీకి అంకితభావంతో సేవలందించిన వీరమహిళ, జనసైనికురాలు మద్దెల రవి భార్య బుజ్జమ్మ అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు నరేంద్ర దండి, ట్రస్ట్ బోర్డు సభ్యులు దండి రాఘవయ్యలు ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత బాధాకరమని అన్నారు. అలాగే మృతురాలి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేశామన్నారు. జనసేన పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన బుజ్జమ్మ సేవలను స్మరించుకుంటూ, వారి కుటుంబానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, అవసరమైన ప్రతి సందర్భంలో తోడ్పాటును అందిస్తుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో జనసైనికులు, వీరమహిళలు, కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు పాల్గొని బుజ్జమ్మకి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా పార్టీ కోసం శ్రమించిన ప్రతి కార్యకర్త కుటుంబం జనసేన కుటుంబమే అన్నారు. వారి కష్టసుఖాల్లో అండగా నిలవడం జనసేన బాధ్యత అని తెలిపారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబంధాలు, డైవోర్సీస్, విడోస్, దోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్స్ప్లానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# ల్యాండ్ పూలింగ్ కింద మూడెకరాల భూమిని అందజేసిన ఉండవల్లి రైతులు





**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రజారాజధాని అమరావతి నిర్మాణానికి అనుమోలు తిరుపతి రాయుడు గారి కుటుంబం ల్యాండ్ పూలింగ్ పథకం కింద తమ భూములను స్వచ్ఛందంగా సోమవారం అందజేసింది. ఉండవల్లి గ్రామ పరిధిలో తమ అధీనంలో ఉన్న మూడెకరాల భూమిని రాజధాని నిర్మాణం కోసం ఆ కుటుంబం APCRDA అధికారులకు అందజేసేందుకు తమ సమ్మతి తెలుపుతూ సంబంధిత పత్రాలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏ.జి. చిన్నికృష్ణకి అందజేసింది. ఆ కుటుంబం నుంచి అనుమోలు తిరుపతి రాయుడు 55 సెంట్లు, అనుమోలు బేబీ జానకి 1 ఎకరం 49 సెంట్లు, అనుమోలు లక్ష్మీ కస్తూరి 1 ఎకరం భూమిని సోమవారం ల్యాండ్ పూలింగ్‌కు అందజేశారు. ఈ భూములు ఉండవల్లి గ్రామ పరిధిలోని కొండవీటి వాగు, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి ప్రాంతంలో ఉన్నాయి. ఈ కుటుంబం పూలింగ్ కింద భూములివ్వడంతో ఆయా ప్రాంతాలలో పనులు జోరందుకోనున్నాయి. ఉండవల్లిలోని పలు భూములను భూసేకరణ కింద అభివృద్ధి పనుల నిమిత్తం సేకరిస్తామని.. ఆయా భూములను భూసేకరణ కింద తీసుకునేందుకు ఇటీవల పబ్లిక్ నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ.. భూసమీకరణలో పాల్గొనేందుకు రైతులకు ఇప్పటికీ అవకాశం ఉందని APCRDA కమిషనర్ చేసిన విజ్ఞప్తి మేరకు తాము భూములు పూలింగ్ కింద అందజేస్తున్నామని అనుమోలు కస్తూరి తెలిపారు. రాజధాని అమరావతి నిర్మాణంలో భాగస్వామ్యం అవుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. రాజధాని గ్రామాల ప్రజలు పూలింగ్ ప్రక్రియకు APCRDA అధికారులతో సహకరించాలని కోరారు.

# కాకాణి గోవర్ధన్ రెడ్డితో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి భేటీ



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు డైకాస్ రోడ్‌లోని వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డితో వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి బేటీ అయ్యారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డితో చంద్రశేఖర్ రెడ్డిపలు విషయాలను చర్చించడం జరిగింది.

# సోనియాగాంధీతో మమతా బెనర్జీ సమావేశం.. భవిష్యత్ వ్యూహంపై చర్చ



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మంగళవారం నాడు 10 జన్‌పథ్‌లో కలిశారు. ఐక్యత, భాగస్వామ్య పార్టీల మధ్య మెరుగైన సమన్వయానికి పిలుపునిస్తూ ఇండియా కూటమి సమావేశం ముగిసిన మరుసటిరోజే ఉభయులూ కలుసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీనికి తోడు టీఎంసీలో తలెత్తిన అంతర్గత తిరుగుబాటు, రాజీనామాల పర్వం కూడా వీరి కలయికకు ప్రధాన కారణంగా చెబుతున్నారు.

**టీఎంసీలో వేగంగా మారుతున్న సమీకరణలు**

ఇండియా కూటమి సమావేశంలో మమతాబెనర్జీ పాల్గొన్న సమయంలోనే ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ రాజీనామా చేయడం, సుమారు 13 మంది ఎంపీలు ఆయన నివాసంలో సమావేశం కావడం, అనంతరం కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ నివాసంలో వీరంతా సమావేశం కావడం సంచలనమైంది. వేగంగా చోటు చేసుకున్న పరిణామాల్లో భాగంగా లోక్‌సభలో తమను ప్రత్యేక గ్రూపుగా పరిగణించాలని కోరుతూ 20 మంది టీఎంసీ ఎంపీలు స్పీకర్ ఓం బిర్లాకు లేఖ పంపారు. దీంతో టీఎంసీలో తలెత్తిన సంక్షోభం మరింత ముదిరింది. ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఓటమిని చవిచూడటం, రాష్ట్ర శాసనసభలో 58 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయడం, ఆ వెంటనే పార్లమెంటుకు సైతం తిరుగుబాటు విస్తరించడం ఆ పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ నేపథ్యంలో సోనియాగాంధీతో మమతా బెనర్జీ అత్యవసరంగా సమావేశమయ్యారు. కాంగ్రెస్, టీఎంసీ భవిష్యత్ వ్యూహంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించినట్టు తెలుస్తోంది.

# అప్పీలు విచారణకు 40 ఏళ్లా.. అలహాబాద్ హైకోర్టుపై సుప్రీంకోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ :** ఓ హత్య కేసులో జీవిత ఖైదు శిక్ష పొందిన వ్యక్తి దాఖలు చేసిన అప్పీలుపై తీర్పు ఇవ్వడానికి అలహాబాద్ హైకోర్టు 40 ఏళ్లకు పైగా సమయం తీసుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సుదీర్ఘ ఆలస్యాలు కలవరపాటుకు గురి చేస్తున్నాయని, పేరుకుపోతున్న కేసులను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని హైకోర్టును సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన విజయ్ సింగ్ 1983 నవంబర్‌లో తన తమ్ముడి హత్య కేసులో అరెస్టయ్యాడు. అప్పుడు విజయ్ వయసు 28 సంవత్సరాలు. ట్రయల్ కోర్టు అతడిని దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ అతడు అలహాబాద్ హైకోర్టులో అప్పీలు చేశాడు. అయితే ఆ అప్పీలుపై తుది నిర్ణయం రావడానికి నాలుగు దశాబ్దాలకు పైగా సమయం పట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో అతడి అప్పీలును అలహాబాద్ హైకోర్టు కొట్టేసింది. ప్రస్తుతం ఈ కేసును సుప్రీంకోర్టు విచారిస్తోంది. మొత్తం ఈ 43 ఏళ్ల కాలంలో విజయ్ మూడు నెలలు మాత్రమే జైలులో ఉన్నాడు. మిగిలిన సమయం అంతా తన అప్పీలుపై తీర్పు కోసం ఎదురు చూస్తూ బయటే గడిపాడు. ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ సమయంలో కూడా అతడికి బెయిల్ కొనసాగుతోంది. అప్పీలుపై విచారణ కోసం అలహాబాద్ హైకోర్టు ఏకంగా 41 ఏళ్ల సమయం తీసుకోవడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan